Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 341 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 30 డిసెంబర్ 2023 | శనివారం | పేజీలు : 4

## మాయావతిని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలి

న్యూఢిల్లీ : తాము 'ఇండియా' కూటమిలో చేరాలంటే తమ నాయకురాలు మాయావతిని 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని బీఎస్పీ షరతు విధించింది. బెంగాల్, ఢిల్లీ సీఎంలు మమతా బెనర్జీ, కేజ్రీవాల్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే పేరును ప్రధాని అభ్యర్థిగా సూచించడంపై బీఎస్పీ ఎంపీ మలూక్ నాగర్ ఓ చానల్‌తో మాట్లాడారు. 'మా ఎమ్మెల్యేలను లాగేసుకున్న కాంగ్రెస్.. మాయావతికి క్షమాపణ చెప్పి తీరాలి. ఆమెను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలి. అప్పుడే ఇండియా కూటమి 2024లో బీజేపీని అడ్డుకోగలదు. ప్రధాని పదవికి దళితులను ప్రతిపాదించాలనుకుంటే మాయావతి కంటే మంచి అభ్యర్థి లేరు. మా షరతులకు కాంగ్రెస్ అంగీకరిస్తే ఆమె కూడా సానుకూలంగా స్పందిస్తారు' అని తెలిపారు.

# 'దరఖాస్తుల జాతర'

## కాంగ్రెస్ 'ఆరు గ్యారంటీ'ల కోసం భారులు తీరుతున్న ప్రజానీకం




## భాగ్యనగరం నుండి సొంతూళ్ళకు పయనమవుతున్న తెలంగాణ వాసులు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల కోసం గురువారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. మొదటి నుంచి ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి భారీగా స్పందన వచ్చింది. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ కార్యాలయాలకు భారీగా ప్రజలు వచ్చి దరఖాస్తులు సమర్పించారు.

ఇటు హైదరాబాద్ లో ఉన్న వారు దరఖాస్తులు చేయడానికి సొంతూరు వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి జనాలు భారీగా గ్రామాలకు తరలివెళ్తున్నారు. ప్రజలతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి. గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచే పంచాయతీ కార్యాలయాల వద్ద బారులు తీరారు.

మున్సిపాలిటీల్లోని వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలకు జనం జాతరలా వచ్చారు. దరఖాస్తులు సమర్పించడానికి సమయం ఉన్నప్పటికీ భారీగా ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. అధికారులు వంద దరఖాస్తులకు ఒక కౌంటర్ ను ఏర్పాటు చేశారు. ఇటు మీ సేవ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, ఆధార్ సెంటర్ల కూడా రద్దీగా మారాయి. దరఖాస్తు ఫారాలను జిరాక్స్ సెంటర్ల యజమానులు రూ. 20 నుంచి రూ. 30 విక్రయించారు. అయితే ఫారలను తము ఉచితంగా అందిస్తామని.. బయట కొనుగోలు చెయ్యొద్దని అధికారులు చెబుతున్నారు.

అయినప్పటికీ ప్రజలు బయట కొనుగోలు చేసి దరఖాస్తు చేస్తున్నారు. దీంతో జిరాక్స్ కేంద్రాల వద్ద రద్దీ కనిపించింది. ఇప్పటికే ఆసరా పింఛన్ పొందుతున్నవారెవరూ మళ్లీ దరఖాస్తు పెట్టాల్సిన అవసరం లేదని అధికారులు చెప్పారు.

కొత్తగా చేయూత పింఛన్ కోసం మాత్రం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామసభ జరిగిన రోజు దరఖాస్తు చేయలేని తర్వాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. చాలా మంది ఆధార్ కార్డు అప్డేట్ కోసం ఆధార్ సెంటర్లకు తరలొచ్చారు.

## తెలంగాణ కొత్త కాంగ్రెస్ చీఫ్ గా భట్టి - రాహుల్ ఛాయిస్...!?

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ కు కొత్త సారధి ఎవరు. పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్ ముఖ్యమంత్రి కావటంలో కొత్త అధ్యక్షుడి నియామకం పైన కసరత్తు ప్రారంభమైంది.

లోక్ సభ ఎన్నికల వేళ రేవంత్ తో కలిసి పార్టీని గెలిపించే నేత పైన అన్వేషణ ప్రారంభమైంది. సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎస్సీ లేదా బీసీ వర్గానికి పీసీసీ బాధ్యతలు అప్పగించాలని ఆలోచన చేస్తున్నారు. దీంతో, పలువురు పేర్లు ప్రచారంలోకి వచ్చాయి.

**కొత్త పీసీసీ చీఫ్ రేసులో :** తెలంగాణ కొత్త పీసీసీ చీఫ్ గా కొత్త పేర్లను కాంగ్రెస్ నాయకత్వం పరిశీలిస్తోంది. ఎస్సీ సామాజిక వర్గం నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేరు పరిశీలనలో ఉందని సమాచారం. కర్ణాటకలో డీకే శివ కుమార్ కు డిప్యూటీ సీఎం పదవితో పాటే పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టిన మాదిరే తనకు కూడా ఆ పదవి ఇవ్వాలి కోరుతున్నట్లు తెలుస్తోంది. నేరుగా సోనియా, ఖర్గేతో భేటీ సమయంలో ఇదే అంశం పైన చర్చించినట్లు సమాచారం. అయితే, సామాజిక సమీకరణాల ఆధారంగా నిర్ణయం ఉంటుందని భావిస్తున్నారు.

సీఎంగా రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంగా ఎస్సీకి అవకాశం ఇవ్వటంతో బీసీ వర్గానికి పీసీసీ చీఫ్ గా బాధ్యతలు ఇచ్చే



అవకాశం ఉందనే అంచనాలు పార్టీ నుంచి వ్యక్తం అవుతున్నాయి.

**సామాజిక సమీకరణాలతో :** బీసీ వర్గం నుంచి పీసీసీ చీఫ్ కోసం మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కీ, మహేష్ కుమార్ గౌడ్, వీ హనుమంతరావు పేర్లు పరిశీలన ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. మధుయాష్కీ తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. దీంతో, మహేష్ కుమార్ గౌడ్ తో పాటుగా యాదవ వర్గానికి చెందిన మాజీ ఎంపీ పేరు పరిశీలనలోకి వచ్చినట్లు చెబుతున్నారు. పీసీసీ చీఫ్ విషయంలో రేవంత్ అభిప్రాయానికి హైకమాండ్ ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. సీఎం – పీసీసీ చీఫ్ కలిసి లోక్ సభ ఎన్నికల వేళ పని చేయాల్సి ఉండటంతో ఈ నిర్నయం పైన హైమాండ్ ఆచి తూచి వ్యవహరిస్తోంది. అయితే, ఎస్సీ వర్గానికి డిప్యూటీ సీఎం..స్పీకర్ పదవి ఇవ్వటంతో బీసీ వర్గానికే పీసీసీ చీఫ్ ఇస్తారని భావిస్తున్నారు.

**భట్టికి ఛాన్స్ దక్కేనా :** త్వరలో జరిగే లోక్ సభ ఎన్నికలు పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ లోక్ సభ ఎన్నికల్లోనూ మెజార్టీ సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యూహాలకు కౌంటర్ గా కాంగ్రెస్ సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడ్ అయింది. మంత్రివర్గ విస్తరణలో మరో ఆరు ఖాళీలు భర్తీ చేయాల్సి ఉండటంతో వచ్చే వారం వీటి పైనా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. దీంతో..ఇప్పుడు భట్టికి పీసీసీ చీఫ్ ఖాయమనే ప్రచారం పార్టీలో జరుగుతున్న వేళ హైకమాండ్ నిర్ణయం ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతోన్న గులాబీ పార్టీ

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు భారత రాష్ట్ర సమతి పూర్తి స్థాయిలో సమాయత్తమవుతోంది. జనవరి 3వ తేదీ నుంచి భారాస.. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ భవన్ వేదికగా ముఖ్యనేతలతో వరుస భేటీలు కొనసాగుతాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ భవన్ వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. జనవరి 3న ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సమావేశంతో సన్నాహక సమావేశాలు ప్రారంభంకానున్నాయి.

4న కరీంనగర్, 5న చేవెళ్ల, 6న పెద్దపల్లి, 7న నిజామాబాద్, 8న జహీరాబాద్, 9న ఖమ్మం, 10న వరంగల్, 11న మహబూబ్‌నగర్, 12న భువనగిరి, 16న నల్గొండ, 17న నాగర్‌కర్నూల్, 18న మహబూబ్‌నగర్, 19న మెదక్, 20న మల్కాజ్‌గిరి, 21న సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమావేశాలు జరుగుతాయని భారాస నేతలు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. భారాస అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జరగబోతున్న ఈ సమీక్షల అనంతరం ప్రజాక్షేత్రంలో ప్రచారపర్వాన్ని బలంగా నిర్వహించేందుకు ఆ పార్టీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.



## కరీంనగర్ నుండి పార్లమెంటు బరిలోకి!?

# కాంగ్రెస్ గూటికేనా...!?

## 'హస్తవాసి' సరి చూసుకోనున్న ఈటెల!

హైదరాబాద్ : బీజేపీ నేత, ఆ పార్టీ సీఎం అభ్యర్థిగా చెప్పుకున్న ఈటల రాజేందర్ వచ్చే లోక్ సభ ఎన్నికల కోసం పావులు కదుపుతున్నారా? ఆయన బీజేపీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ బాట పడుతున్నారా? కాంగ్రెస్ నుండి పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దిగనున్నారా? అంటే అవునట.. అన్న చర్చ తెలంగాణా సమాజంలో జోరుగా జరుగుతుంది. బిజెపి నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు అన్నది ప్రస్తుతం రాజకీయ వర్గాలలో జరుగుతున్న చర్చ. ఇప్పటికే కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు జరిపారని, అతి త్వరలోనే ఆయన కాంగ్రెస్ తీర్థం తీసుకుంటారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది.

అసెంబ్లీ ఎన్నికలలో హుజూరాబాద్ నియోజకవర్గం నుండి, గజ్వేల్ నియోజకవర్గం నుండి పోటీ చేసిన ఆయన ఓటమి పాలు కావడంతో, ప్రస్తుతం ఫోకస్ లోక్సభ ఎన్నికలపై పెట్టారని సమాచారం. ఆయన రానున్న లోక్సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు టికెట్ విషయంలో కాంగ్రెస్ కూడా ఆయనకు హామీ ఇచ్చినట్లుగా సమాచారం. లోక్సభ ఎన్నికలకు బిజెపిలో తీవ్రమైన పోటీ ఉండడంతో, బిజెపి నుండి కాకుండా కాంగ్రెస్ నుంచి ఎన్నికల బరిలోకి దిగాలని ఈటల రాజేందర్ భావిస్తున్నట్లుగా సమాచారం.

లోక్సభ కరీంనగర్ స్థానం నుండి పోటీకి ఈటల రాజేందర్ ప్రయత్నం చేస్తున్నారని చర్చ జరుగుతుంది. బిజెపి కరీంనగర్ స్థానం నుండి బండి సంజయ్ మళ్లీ పోటీ చేయడానికి రెడీ అవుతుండగా, అదే స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి ఈటల రాజేందర్ పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లుగా టాక్ వినిపిస్తుంది. 2024లో జరగనున్న లోక్సభ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్సభ స్థానాలలో పదికి పైగా స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పటినుండే లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని, గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ గతంలో కరీంనగర్ ఎంపీగా పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రి పదవిని కూడా చేపట్టారు. దీంతో కరీంనగర్ లోక్సభ స్థానం ఖాళీగా ఉంది. ఈ స్థానం నుండి ఈటల రాజేందర్ ను బరిలోకి దింపితే ప్రయోజనం ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది.

కరీంనగర్ జిల్లా పై ఈటల రాజేందర్ కు మంచి పట్టు ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈటలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. మరి ఈ విషయంలో ఈటల రాజేందర్ ఏం నిర్ణయం తీసుకోబోతున్నారు అన్నది త్వరలోనే తేలనుంది.

## సంపాదకీయం

# 2023 చివరి రోజుకు ఓ ప్రత్యేకత ఉంది.. అదేంటో తెలుసా?

సంవత్సరాలు వస్తుంటాయి పోతుంటాయి. ఒక్కో సంవత్సరానికి ఒక్కో ప్రత్యేకత సూచిస్తుంది. న్యూమరాలజీ ప్రకారం దాని ప్రాముఖ్యత తెలిస్తే ఆశ్చర్యపోతుంటాం. ఇలా మన జీవితంలో ఎన్నో సంవత్సరాలు వచ్చి వెళ్లడం మామూలే. ప్రతి సంవత్సరం ఏదో ఒక అనుభూతిని కలిగించడం సహజమే. ఈనేపథ్యంలో సంవత్సరాల గురించి మాట్లాడుకోవడం కామన్. వాటి సంఖ్యలను గమనించి దాని వల్ల మనకు లభించే వాటిని పరిశీలిస్తుంటాం. 2023కు వీడ్కోలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ సంవత్సరం చివరి తేదీ 31/12/2023ని గమనిస్తే 123123 అని సూచిస్తుంది. ఈ నంబర్ చూడగానే ఆకర్షణీయంగా ఉంటుంది. ఆకట్టుకునేలా కనిపిస్తుంది. ఈక్రమంలో ఇది దేవతల సంఖ్యగా చెబుతుంటారు. ఇవి దివి నుంచి భువికి పంపినట్లుగా భావిస్తుంటారు. అందుకే ఈ సంఖ్య ఎంతో విశిష్టమైనదిగా గుర్తిస్తున్నారు. 123లో ప్రతి సంఖ్యకు ఎంతో అర్థం ఉంటుందని చెబుతారు. నెంబర్ వన్ ఎప్పుడు కొత్త అర్థాన్ని సూచిస్తుంది. కొత్త ప్రారంభానికి సంకేతంగా నిలుస్తుంది. నెంబర్ 2 భావోద్వేగం, ఆనందాల గురించి తెలియజేస్తుంది. నెంబర్ 3 నేర్చుకోవడానికి ఎదుగుదల గురించి విశదీకరిస్తుంది. ఇలా 123 మనకు చాలా విషయాలు వివరిస్తున్నాయి. 123ని 1o2o3 గా చూస్తే వీటి సమానం 6 అవుతుంది. ఇది కూడా సమతుల్యత, ప్రేమలకు నిదర్శనంగా నిలుస్తుంది. 2023 సంవత్సరం నుంచి 2024 సంవత్సరానికి మారుతున్న నేపథ్యంలో రెండు సంవత్సరాలకు కూడా మంచి సంబంధం ఏర్పడింది. 2023 సత్యం, 2024 శక్తి, ప్రకాశాన్ని తెలియజేస్తుందని న్యూమరాలజీ ప్రకారం తెలుస్తోంది. దీంతో ఈ తేదీకి ప్రాధాన్యం కలుగుతోంది. దీనికి సంబంధించిన వీడియోలు, మీమ్స్ సోషల్ మీడియాలో వైరల్ గ మారుతున్నాయి. కొత్త ఒక వింత పాత ఒక రోతగా అన్నట్లు ఎప్పుడు కూడా గడిచిపోయే స్వాగతించే తేదీలు మనకు మధుర జ్ఞాపకాలు మిగల్చడం మామూలే. ఇందులో భాగంగానే 311223 తేదీలో మనకు కలిసొచ్చే అంశాలు ఉన్నాయని నమ్ముతున్నారు. దీని కోసమే సామాజిక మాధ్యమాల్లో వీటి గురించి తెగ ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది చివరి రోజు అందరి మదిలో నిలవడం ఖాయం.

# ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందచేసేందుకే ప్రజాపాలన

### ఆరు గ్యారంటీల పథకాల ఫలాలు అర్హులందరికీ అందేలా చర్యలు, మేడ్చల్ మండలంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్ గిరి (గరుడ వార్త) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆరు గ్యారెంటీల పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిధిలోని మేడ్చల్ మండలంలో జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మేడ్చల్ మండంలోని 7, 23 వార్డులు, గౌడవెల్లి గ్రామాల్లో ప్రజాపాలనలో భాగంగా జరుగుతున్న గ్రామసభను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రజాపాలన ఆరు గ్యారంటీల ఫలాలను అందించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలవారీగా పూర్తిస్థాయి చర్యలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ నుండి జనవరి 6వ తేదీ 2024 వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే సంబంధిత రీసోర్స్ పర్సన్లు, సిబ్బంది అందచేసిన దరఖాస్తులను పూరించి (నింపి) దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లలో అందించాలని, దరఖాస్తుదారులు నిజమైన సమాచారాన్ని ఫారమ్లో పొందుపర్చాలని, తద్వారా అర్హత గల లబ్దిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ గౌతమ్ వివరించారు. ఈ సందర్భంగా మొదటిరోజైన గురువారం ప్రజాపాలనలో ఎన్ని దరఖాస్తులు స్వీకరించారు అలాగే శుక్రవారం ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్వీకరించే దరఖాస్తులకు అవసరమైన ఆధార్కార్డులు, రేషన్ కార్డులు, ఫోటోలు తదితరాలు జత చేశారా అనే విషయాన్ని సంబంధిత అధికారులు, సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం స్వీకరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు ప్రజలకు ఇబ్బంది కలగకుండా వంద మంది కంటే ఎక్కువగా ఉన్నట్లయితే మరో కౌంటర్ కూడా ఏర్పాటు చేయాలని ఈ విషయంలో సంబంధిత ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాల్సిందిగా వివరించారు. ప్రజాపాలన గ్రామసభలో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎంతో జాగ్రత్తగా ఉండాలని ఏమాత్రం పొరపాట్లు చోటు చేసుకున్నా ప్రజలకు ప్రభుత్వ పథకాలు దూరమవుతాయని దీనిని దృష్టిలో పెట్టుకోవాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు, సిబ్బందికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల కొందరు దరఖాస్తుదారులు కొన్ని సందేహాలను జిల్లా కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకురాగా వారి సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

# శాసనసభ స్పీకర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన శామీర్ పేట కాంగ్రెస్ నాయకులు

### మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్, ఎంపీటీసీ డప్పు సాయిబాబు



శామీర్ పేట, డిసెంబరు 29(గరుడ వార్త) : శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను శామిర్ పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, శామీర్ పేట మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు డప్పు సాయిబాబు, మైనార్టీ నాయకుడు ముజీబుద్దిన్ అందరు కలిసి నగరంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# గురుకుల పాఠశాలల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ...

శామీర్ పేట, డిసెంబరు 29(గరుడ వార్త) : గురుకుల పాఠశాలల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలల 2024- 25లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చేనెల 6వ తేది వరకు ఆన్లైన్లో రూ .100 చెల్లించి అర్హులైన




విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11వ తేదీ రోజున అర్హత పరీక్ష ఉంటుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలో పాల్గొనాలని చెప్పారు. గురుకుల పాఠశాల సీటును సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశం సద్వినియం చేసుకోవాలని సూచించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి 6 గ్యారంటీ పథకాలు లభిస్తాయి

### జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి



శామీర్ పేట, డిసెంబరు 29 (గరుడ వార్త) : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందజేసే ఆరు గ్యారెంటీ పథకాలు అందుతాయని జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం మూడు చింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరిణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తుంకుంట మున్సిపాలిటీ షామీర్పేట మూడు చింతలపల్లి మండలాల పరిదిలోని వివిధ గ్రామాలలో ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కొనసాగించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ఎంతో ద్రుడ నిశ్చయంతో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరు ఆరు గ్యారెంటీ పథకాల లబ్ధి పొందుతారని తెలిపారు. నాగిశెట్టిపల్లి గ్రామంలో ఎంపీటీసీల పోరం అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, సర్పంచ్ కృపాకర్ రెడ్డి దరఖాస్తులను స్వీకరించారు దరఖాస్తులను సమర్పించడానికి ప్రజలు ఆయా గ్రామాల్లో రెండవ రోజు అత్యధికంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్లు సత్యనారాయణ, వాణి రెడ్డి, ఎంపీడీవోలు వాణి, వత్సల దేవి,



తూముకుంట మున్సిపల్ పరిధిలో చైర్మన్ రాజేశ్వరరావు, వైస్ చైర్ పర్సన్ వాణి వీరారెడ్డి, కమిషనర్ జైత్రం నాయక్, మూడు చింతలపల్లి వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# పల్లెపల్లెన.. ప్రగతి చాటేలా..

ఖమ్మం : తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు వేడుకలు జరిపేందుకు కార్యాచరణ రూపొందించింది. పల్లె నుంచి జిల్లా స్థాయి వరకు పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు గడిచిన తొమ్మిదేళ్లలో ప్రభుత్వం అమలుపరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించనున్నారు.

**నాడు- నేడు.. అభివృద్ధిని చూడు..**

రైతు, విద్యుత్తు, పారిశ్రామిక, సాగునీరు, సంక్షేమం, పరిపాలన, సాహిత్యం, ఆధ్యాత్మికం, వైద్యారోగ్యం, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, తదితర రంగాల్లో గడిచిన తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని ఊరూరా చాటిచెప్పేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. జిల్లాల వారీగా ప్రగతి నివేదికలు విడుదల చేయడంతోపాటు పల్లెల వారీగా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గ్రామసభలు, సమావేశాల ద్వారా చాటిచెప్పనుంది. రాష్ట్రావతరణకు ముందు, ఆతర్వాత పరిస్థితులను కళ్లకు కట్టేలా వివరించనుంది. ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాల పేరిట మూడు నెలలుగా అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతులతో చెరువు కట్టలపై సహపంక్తి భోజనాలు చేయనున్నారు.

**3న రైతు వేదికల్లో వేడుకలు**

జూన్ 3న 'రైతు దినోత్సవాన్ని' రైతు వేదికల్లో అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఆయా పంచాయతీ కార్యాలయాల నుంచి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లను అలంకరించుకొని డీజే శబ్దాలతో రైతువేదికల వరకు ర్యాలీగా వెళ్లనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యవసాయంలో రాణిస్తున్న ముగ్గురు చొప్పున కర్షకులను రైతువేదికల్లో సన్మానిస్తారు. వారితో విజయగాథలు చెప్పిస్తారు. వేడుకలకు హాజరైన రైతులకు అధికారులు భోజనం సమకూరుస్తారు.

# యోగా శిక్షణ.. తప్పని నిరీక్షణ

ఇబ్రహీంపట్నం : ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో చాలా మంది శారీరక శ్రమకు దూరమవుతున్నారు. పని ఒత్తిడితో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలకు అనుబంధంగా జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా యోగా(ఆరోగ్య స్వస్థత) కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో రోగులకు యోగా శిక్షణ ఇవ్వనుంది.

**మొదటి విడతలో 12..**

జిల్లాలో 18 మండలాలు ఉండగా మొదటి విడతలో 12 యోగా కేంద్రాల నిర్మాణానికి నిధులను గతేడాది మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.72 లక్షలను కేటాయించారు. జిల్లాలో వివిరావుపేట్, వెల్లుల్ల, బండలింగపూర్, ఎండపల్లి, కొడిమ్యాల, మేడిపల్లి, అయిలాపూర్, బతికేపల్లి, ధర్మపురి, లక్ష్మీపూర్, చిల్వాకోడూర్, అల్లీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ఆవరణలో వీటిని నిర్మిస్తున్నారు. వీటిలో చిల్వాకోడూర్, అల్లిపూర్‌లో నిర్మాణ పనులు జరుగుతుండగా, మిగిలిన వాటిలో నిర్మాణాలు పూర్తయ్యాయి.

**ఒక్కో కేంద్రానికి ఇద్దరు శిక్షకులు**

ఒక్కో యోగా కేంద్రంలో ఇద్దరు శిక్షకులను నియమించనున్నారు. ఆడవారికి శిక్షణ ఇవ్వడానికి ఆడ, మగ వారికి శిక్షణ ఇవ్వడానికి మగ శిక్షకుడు ఉంటారు. ఆడ, మగ వారికి ఒకే సమయంలో కాకుండా వేర్వేరు సమయాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. పలు చోట్ల కొన్ని నెలల క్రితమే నిర్మాణాలు పూర్తికావడంతో వృథాగా ఉంటున్నాయి. శిక్షకులను నియమిస్తే యోగా కేంద్రాలు అందుబాటులోకి వచ్చి, ప్రజలకు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగులకు మేలు జరగనున్నాయి.

**సొంత భవనాలు లేక వేరే చోట..**

బండలింగాపూర్, వెల్లుల్ల, ఎండపల్లి, కోరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడం, ఇతర కారణాలతో వాటికి మంజూరైన యోగా కేంద్రాలను వేరే చోట నిర్మించారు. బండలింగాపూర్‌కు మంజూరైన యోగా కేంద్రం ఇబ్రహీంపట్నంలో, వెల్లుల్ల యోగా కేంద్రం జగ్గాసాగర్‌లో, ఎండపల్లి యోగా కేంద్రం అంబరిపేట్‌లో, కోరుట్ల యోగా కేంద్రం అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో నిర్మించారు.

**నియామకం పూర్తయితే..- శ్రీనివాస్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య ఉప వైద్యాధికారి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాల్లో రక్తపోటు, మధుమేహ, థైరాయిడ్ వంటి వాటితో బాధపడుతున్న దీర్ఘకాలిక రోగులతో పాటు గర్భిణులు, ప్రజలకు యోగా శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షకుల నియామకం పూర్తయిన తర్వాత శిక్షణ ప్రారంభం కానుంది.

# 'పుర' రాజకీయం.. రసవత్తరం

కాగజ్‌నగర్ : సిర్పూరు నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ పురపాలిక రాజకీయం రసవత్తరంగా మారింది. సొంత పార్టీ(భారాస) ఛైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ ఛైర్మన్ రాచకొండ గిరీశ్‌లు, ఆ పార్టీలోని కౌన్సిలర్లు మధ్య ఏర్పడిన విభేదాలు అవిశ్వాసానికి దారి తీశాయి. పురపాలికలో 30 వార్డులుండగా భారాస 22, కాంగ్రెస్ 6, ఇద్దరు స్వతంత్రులు గెలుపొందిన విషయం తెలిసిందే. భారాసకు చెందిన కౌన్సిలర్లు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్, స్వతంత్రులు భారాసలో చేరారు. ఇటీవల శాసనసభ ఎన్నికలకు ముందు భారాసకు చెందిన ముగ్గురు బీఎస్పీలో చేరిన విషయం తెలిసిందే. ఛైర్మన్ వైఖరికి నిరసనగా 24 మంది కౌన్సిలర్లు ఏకమై ఈ నెల 18వ తేదీన ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌పై అవిశ్వాసానికి జిల్లా పాలనాధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు. 2024 జనవరి 9వ తేదీన జిల్లా పాలనాధికారి ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు తేదీ ఖరారు కాగా నేడో, రేపో పురపాలిక కౌన్సిలర్లకు జిల్లా పాలనాధికారి నుంచి ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

ఎత్తుకు పైఎత్తు.. : పురపాలికలో 30 మంది కౌన్సిలర్లు ఉండగా అవిశ్వాసానికి 20 మంది అవసరం. 24 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అవిశ్వాసం వీగిపోయేలా ఛైర్మన్ ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఛైర్మన్‌తోపాటు ఆయన సమీప బంధువు ఒక మహిళా కౌన్సిలర్‌తోపాటు, మరో ఇద్దరు ఆయనకు అండగా అవిశ్వాసానికి దూరంగా ఉన్నారు. ఒక మహిళా కౌన్సిలర్ స్థానికంగా ఉండటం లేదు. అవిశ్వాసం నిమిత్తం సంతకాలు చేసిన మరో ఎనిమిది మందికి




ప్రస్తుతం ఛైర్మన్ భారీ ఎత్తున నజరానాలు ఎర చూపి తమవైపు తిప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరికొంత మంది కౌన్సిలర్ల అండ ఉండటంతో అవిశ్వాసం వీగిపోవడం ఖాయమనే ధీమాలో ఉన్నారు. సొంత పార్టీలో ఏర్పడిన విభేదాలతో అవిశ్వాసానికి తెర లేపినప్పటికీ అధిష్ఠానం, స్థానిక మాజీ ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప పాలకవర్గం మధ్య సయోధ్యకు చర్యలు తీసుకోకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత ఛైర్మన్ మాత్రం తాను శాసనసభ ఎన్నికల్లో కోనేరు కోనప్ప గెలుపునకు తీవ్ర కృషి చేసినప్పటికీ తమపైనే సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టడం... మాజీ ఎమ్మెల్యే స్పందించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఛైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గుతుందా? వీగి పోతుందా అనే విషయం వచ్చే నెల 9వ తేదీ సమావేశంలో తేలనుంది.

# గురుకుల విద్యతో బంగారు భవిత

నిజామాబాద్ : ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం ప్రకటన విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వచ్చే ఏడాది జనవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్ని ఆయా సంక్షేమ శాఖల ద్వారా నిర్వహిస్తున్నారు. వీటన్నింటిలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుంది. గిరిజన తండాలు, మారుమూల గ్రామాల్లో బడులు లేక చదువుకు దూరమవుతున్న పేద పిల్లలకు అత్యున్నత ప్రమాణాలు, అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ బోధన చేసి ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు గురుకులాలు దోహదపడుతున్నాయి.

అర్హతలు ప్రస్తుత విద్యాసంవత్సరం(2023-24)లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. 2024 సెప్టెంబరు 1 నాటికి 9-11 ఏళ్ల మధ్య వయసుండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండేళ్ల గరిష్ఠ సడలింపు ఇచ్చారు. గ్రామీణ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలకు మించరాదు.

ఆన్‌లైన్‌లోనే..



అర్హతలు, ఆసక్తిగల విద్యార్థి తల్లిదండ్రులు జనవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ఇందుకోసం వెబ్‌సైట్లు %http://mjptbcwreis.telangana.gov.in,http:///tgcet.cgg.gov.in, http:///tswreis.in, http:///tgtwgurukulam.telangana.gov.in% లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థి బోనాఫైడ్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అవసరమవుతాయి. వీటితో పాటు రూ.వంద ఆన్‌లైన్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

గురుకుల ప్రవేశానికి ప్రకటన విడుదలైనందున పేద ప్రజలు వారి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. బాలబాలికలకు వేర్వేరుగా గురుకులాలు ఉన్నాయి. మంచి భోజనం, వసతితో కూడిన నాణ్యమైన విద్య ఇక్కడ అందుతుంది. సమయం తక్కువగా ఉన్నందున తల్లిదండ్రులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. సత్యనాథ్‌రెడ్డి, ఆర్సీవో, మహాత్మా జోతిబా ఫులే బీసీ గురుకుల సంస్థ

# అటకెక్కిన వయోజన విద్య



ఖమ్మం : 'వయోజన విద్య' పథకం అటకెక్కింది. 1978లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అప్పట్లో ఖమ్మం, భద్రాచలం ప్రాజెక్టులు ఏర్పాటు చేశారు. ఒక్కోదాంట్లో సుమారు 100 మంది వరకు వాలంటీర్లు వయోజనులకు విద్య నేర్పించారు. నిరక్షరాస్యులను గుర్తించడం, వారికి రాత్రి బడులు ఏర్పాటు చేసి అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచి 1991 వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. 1991లో ప్రాజెక్టులను తీసివేసి జిల్లా సాక్షరత సమితిని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న 7.10 లక్షల మందిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. అక్షర దీపం పేరుతో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. అదే పథకం 2009 వరకు కొనసాగింది.

నామమాత్రంగా మారిన వైనం..

2010లో జిల్లా సాక్షర సమితి స్థానంలో 'సాక్షర భారత్'ను ఏర్పాటు చేశారు. 2018లో ఈ పథకాన్ని కూడా నిలిపివేశారు. అప్పటి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవటంతో వయోజన విద్యకు గ్రహణం పట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా దీనిపై దృష్టి పెట్టి నిధులు విడుదల చేస్తే ఈ శాఖ కొనసాగే అవకాశం ఉంది. లేకుంటే పేరుకే వయోజన విద్యాశాఖ అన్న చందంగా ఉంటుంది.

మిగిలింది ఇద్దరే...

ఖమ్మంలో ఉన్న వయోజన విద్య కార్యాలయంలో ఒక ఉప సంచాలకుడు, ఇద్దరు ఏపీఓలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక ఏపీఓ ఉన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న వర్మ ఇన్‌ఛార్జి ఉప సంచాలకుడిగా పని చేస్తున్నారు. ఇక రెండు జిల్లాలకు కలిపి కేవలం ఇద్దరు ఏపీఓలు మాత్రమే మిగిలారు. ఇలా రాష్ట్రంలో సుమారు 30 మంది ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. సుమారు ఐదేళ్ల నుంచి ఎలాంటి కార్యకలాపాలు లేక ఖాళీగా ఉంటున్నారు.

ఇతర శాఖల్లో విలీనం ఏమైంది...సాక్షర భారత్‌లో ఎలాంటి కార్యక్రమాలు లేకపోవటంతో ఈ పథకంలో పని చేసే ఉద్యోగులను వేరే శాఖలో కలపాలనే ప్రతిపాదనలు జరిగాయి. ప్రధానంగా ప్రస్తుతం అమల్లో 'ఓపెన్ స్కూల్' విభాగంలో ఉద్యోగులను కలపాలని భావించారు. ఓపెన్ స్కూల్ విభాగంలోనూ రెండు జిల్లాలకు కలిపి ప్రస్తుతం ఇద్దరే ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఒకరు కోఆర్డినేటర్ కాగా మరొకరు కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. వయోజన విద్యలో ప్రస్తుతం పని చేస్తున్న ఇద్దర్ని కూడా ఈ విభాగంలో పని చేయటం వల్ల ఓపెన్ స్కూల్ విధానం మరింత బలోపేతమవుతుందని పలువురు భావిస్తున్నారు. ఖాళీగా ఉంచే బదులు ఇతర ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసినా కొంత వరకు ఉపయోగం ఉంటుంది.

# వాహన చలాన్లపై ఊరట



ఖమ్మం : రవాణాశాఖ నిబంధనలు మీరిన వాహనాలకు విధించే జరిమానా రుసుముపై ఆ శాఖ భారీ రాయితీ ప్రకటించింది. వివిధ వాహనాల యజమానులు జరిమానాలు సకాలంలో చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. వీటిని చెల్లించేందుకు రాయితీ ప్రకటించడంతో భారీగా చలాన్లు వసూలయ్యే అవకాశం ఉంది. ట్రాఫిక్ చలాన్లను డిసెంబరు 26 నుంచి 2024 జనవరి 10వ తేదీలోగా చెల్లించే వారికి రాయితీలను ప్రకటించారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలపై 80 శాతం, కార్లు, ట్రాలీలు వంటి నాలుగు చక్రాలు, లారీలు, ఇతర భారీ వాహనాలపై 60 శాతం రాయితీని ప్రకటించారు. మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో %http:///echallan.tspolice .gov.in% ద్వారా చెల్లించవచ్చని మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించింది.

గత ఏడాది సైతం పెండింగ్ చలాన్లపై పోలీసు శాఖ రాయితీ ప్రకటించింది. ఆ నిర్ణయంతో వాహనదారులు భారీగా చలాన్లను చెల్లించారు. రాష్ట్రస్థాయిలోనే ఇది ఉత్తమ ఫలితాన్నిచ్చింది. నూతన సంవత్సరంలో ప్రవేశించే ముందు ప్రభుత్వం మరోమారు రాయితీని ప్రకటించి వాహనదారులకు తీపి కబురు అందించింది.

జిల్లాలో వాహనాల అతివేగం చలాన్లు తక్కువగా ఉంటాయి. ఎరుపు సిగ్నల్ ఉన్నా వాహనం దాటించే వారు, హెల్మెట్ ధరించలేదని, రాంగ్ పార్కింగ్ చేశారని చలాన్లు ఎక్కువగా విధిస్తుంటారు. రుసుము చెల్లించాల్సిన వారిలో ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనాల యజమానులు ఎక్కువగా ఉన్నారు. పోలీసు శాఖ ప్రకటించిన ఈ నిర్ణయం వారిపై పెనుభారాన్ని తగ్గించనుంది. మరోమారు వాహనదారుల నుంచి జిల్లాలో భారీగా జరిమానాలు వసూలయ్యే అవకాశం ఉందని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలో ఇలా....జిల్లాలో 2018 నుంచి వాహనదారులపై విధించిన సుమారు 9 లక్షల ఈ-చలాన్లు పెండింగులో ఉన్నాయి. వీటిలో ఖమ్మం నగరంలో నమోదు చేసినవే సుమారు 5 లక్షలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

సర్వర్‌లో సమస్యలు...

ప్రభుత్వం జరిమానాలపై రాయితీ ప్రకటించడంతో సద్వినియోగం చేసుకునేందుకు వాహనదారులు విశేషంగా స్పందిస్తున్నారు. రాయితీ భారీగా ఉండటంతో అందరూ తొలిరోజే జరిమానాలు చెల్లించేందుకు రాష్ట్రవ్యాప్తంగా వాహనదారులు ప్రయత్నిస్తున్నారు. దీంతో సర్వర్‌పై తీవ్ర ఒత్తిడి ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో జరిమానాలు చెల్లించేందుకు ఆటంకం ఏర్పడుతున్నట్లు సమాచారం.

# చిన్నబడులకు తీరేను చింత




మధిర : చిన్నారులు, బాలింతలు, కిశోరబాలికల ఆరోగ్యపరిక్షణే లక్ష్యంగా ఏర్పాటైన అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. అయిదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ బాట పట్టించి కేంద్రాలను బలోపేతం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు విద్యుత్తు సౌకర్యం లేని కేంద్రాల్లో వెలుగులు నింపాలని నిర్ణయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల కష్టాలు తొలగనున్నాయి.

శౌచాలయాల్లేక ఇబ్బందులు

జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అత్యధికం సొంతభవనాల్లో, మరికొన్ని అద్దెభవనంలో నడుస్తున్నాయి. సొంత భవనాలున్న పలు కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు. చిన్నారులు మల, మూత్ర విసర్జనకు బయటకు వెళుతున్నారు. కేంద్రాల్లోని పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మరుగుదొడ్ల నిర్మాణంపై అధికారులు దృష్టిసారించారు. శౌచాలయాలు లేని కేంద్రాలను గుర్తించి వాటిని నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరు చేస్తున్నారు. ఒక్కో మరుగుదొడ్డిని రూ. 40వేల వ్యయంతో నిర్మించనున్నారు. అవి పూర్తయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఇక్కట్లు తొలగనున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తు వెలుగులు

సొంత భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్నింటిలో విద్యుత్తు సౌకర్యం లేదు. వేసవిలో ఉక్కపోతతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 236 కేంద్రాల్లో విద్యుత్తు సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో ఆయా కేంద్రాలకు విద్యుత్తు వెలుగులు ప్రసరించనున్నాయి. నెలాఖరుకల్లా పనులన్నీ పూర్తిచేయిస్తాం-సుమ, జిల్లా సంక్షేమాధికారిఅంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో వసతులు సమకూరుస్తున్నాం. ఇప్పటికే అవసరమున్న కేంద్రాలను గుర్తించాం. వాటిలో మరుగుదొడ్లు, విద్యుత్తు సౌకర్యం వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను నెలాఖరుకల్లా పూర్తి చేస్తాం.

# ధాన్యం రైతులకు గిట్టుబాటు

ఖమ్మం : ప్రభుత్వ కొనుగోళ్లు మందగించగా.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు ఇక్కడి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం మిల్లర్లు, వ్యాపారులు పోటీ పడి కొంటున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలువురు మిల్లర్లు, వ్యాపారులు ఖమ్మం జిల్లాలోని పలు గ్రామాల్లో ధాన్యం ఖరీదు చేస్తున్నారు. జిల్లాలో 25 మిల్లుల్లో డ్రయ్యర్లు (తడిసిన ధాన్యం ఆరబెట్టే యంత్రాలు) ఉన్నాయి. బాయిల్డ్ రైస్ మిల్లర్లు తమకు అనుకూలమైన తడిసిన ధాన్యాన్ని కొనేస్తున్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల తుపాను ప్రభావంతో పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ఆయా ప్రాంతాల వారు ఆసక్తి చూపుతున్నారు.ఖరీఫ్‌లో వర్షాభావం వర్షాభావం, సాగర్ జలాల కొరతతో ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం తగ్గింది. విద్యుత్తు మోటార్లు, చెరువుల కింద రైతులు వరి పండించారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించగా 13,639 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. చాలా ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయింది. అలాంటి సరకు సైతం ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లు కొంటున్నారు. రైతులు పొలంలో ధాన్యం కోత కోస్తుండగానే పచ్చిగా ఉన్న ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో అధికారుల లక్ష్యం నెరవేరని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం సాధారణ రకం రూ. 2,020, సన్న రకానికి రూ. 2,040 కనీస మద్దతు ధర నిర్ణయించింది.

# మన బస్సులు భద్రమేనా..?

మిర్యాలగూడ : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ అతివలతో ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. అధిక బరువు కారణంగా బస్సు నియంత్రణ అదుపుతప్పొచ్చని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త పల్లెవెలుగు బస్సులు రాకపోవడంతో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాలం చెల్లిన బస్సులను సైతం నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటివల్ల ప్రమాదాలు తలెత్తితే ప్రాణాపాయం జరిగే అవకాశం ఉంటుంది.

బస్సుల పర్యవేక్షణ ఇలా..

సాధారణంగా బస్సును డిపో నుంచి బయటకు తీసే సమయంలో మెకానికల్ ఇంజినీర్ పరిశీలించి ఏమైనా సమస్యలుంటే మరమ్మతులు చేయిస్తారు. టైర్లతో పాటు బస్సులోని నట్లు, బోల్టులన్నీ బిగించి పంపిస్తారు. డ్రైవర్ కూడా సరిచూసుకుంటారు. తిరిగి డిపోలోకి వచ్చే సమయంలో డ్రైవర్లు గుర్తించిన సమస్యలను ప్రత్యేకంగా చెబుతారు. వీటికి రాత్రి విధుల్లో ఉండే మెకానిక్ సిబ్బంది సరిచేయాలి. ఆర్టీసీ అధికారులు ప్రతి నెలా అద్దె బస్సుల సామర్థ్యాన్ని తనిఖీ చేస్తారు. వారి సలహాల మేరకు వాటి యజమానులు బయట మరమ్మతులు చేయించుకోవాలి. నెలకోసారి మాత్రమే తనిఖీలు చేపట్టడంతో వాటి భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీలతో సతమతం..

సాధారణంగా డిపోలో వంద బస్సులుంటే 32 మంది మెకానిక్‌లు, ఒక్కో మెకానిక్‌కు ఒక సహాయకుడు ఉండాలి. కొన్నేళ్లుగా ఆర్టీసీలో నూతన నియామకాలు చేపట్టకపోవడంతో మెకానిక్‌ల సంఖ్య భారీగా తగ్గింది. ఇటు బస్సుల సంఖ్య సైతం తగ్గినందున సరిపడా మెకానిక్‌లున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిర్యాలగూడ డిపోలో మొత్తం 106 బస్సులు ఉండగా.. 34 మంది మెకానిక్‌ల అవసరం. కానీ, 19 మంది మాత్రమే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల్లో ఇదే పరిస్థితి నెలకొంది. సహాయకులుగా అప్రెంటిస్‌లను నియమిస్తున్నా.. సరిపడా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు విముఖత చూపుతున్నట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు.

వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై ఆదివారం హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వెనుక చక్రాలు ఊడిపోయాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

2021 జులై 21న యాదాద్రి భువనగిరి జిల్లా కాటేపల్లిలో ఆర్టీసీ బస్సు వెనుక చక్రాలు ఊడిపోయాయి. ఆ బస్సులో 40 మంది ప్రయాణికులుండగా.. డ్రైవర్ అప్రమత్తతో ముప్పుతప్పింది. కాలం చెల్లిన బస్సు కావడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు వాపోయారు. 2022లో ఏపీలోని కడియం వద్ద ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిలైంది. డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది.

ఈ ఏడాది మార్చి 29న సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ ఏసీ బస్సు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయింది.

మార్చి 30న మునగాల మండలం ఇందిరానగర్ వద్ద మియాపూర్ డిపోకు చెందిన రాజధాని బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని దగ్ధమైంది.

వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై ఆదివారం హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వెనుక చక్రాలు ఊడిపోయాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

2021 జులై 21న యాదాద్రి భువనగిరి జిల్లా కాటేపల్లిలో ఆర్టీసీ బస్సు వెనుక చక్రాలు ఊడిపోయాయి.ఆ బస్సులో 40 మంది ప్రయాణికులుండగా.. డ్రైవర్ అప్రమత్తతో ముప్పుతప్పింది. కాలం చెల్లిన బస్సు కావడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు వాపోయారు.2022లో ఏపీలోని కడియం వద్ద ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిలైంది. డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది.

ఈ ఏడాది మార్చి 29న సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ ఏసీ బస్సు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయింది.

మార్చి 30న మునగాల మండలం ఇందిరానగర్ వద్ద మియాపూర్ డిపోకు చెందిన రాజధాని బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని దగ్ధమైంది.

నిత్యం మరమ్మతులు చేయిస్తాం

- శివశంకర్, డిప్యూటీ ఆర్ఎం, నల్గొండ

డిపోల్లోని మెకానిక్ సిబ్బంది రోజూ బస్సు బయటకు వచ్చే సమయంలో పరిశీలించి, నట్లు, బోల్టులు బిగించి పంపిస్తారు. వారికి తోడుగా పొరుగు సేవల సిబ్బంది, ఐటీఐ శిక్షణ విద్యార్థులు సహాయకులుగా ఉంటారు. ఏటా రబ్బర్ వస్తువులను తప్పనిసరిగా మారుస్తాం. అన్ని బస్సులు 16 టన్నుల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ప్రయాణికులతో బస్సు నిండినా 11 టన్నులకు మించదు.

# కంది సాగు తగ్గె.. పప్పు ధర పెరిగె

భానుపురి: మార్కెట్‌లో కందిపప్పు ధరలు మండిపోతున్నాయి. సామాన్యులు కొనుగోలు చేసి వండుకోలేని పరిస్థితి నెలకొంది. కనీసం వారానికోసారైన వండుకునేందుకునే ఆసక్తి చూపడం లేదు. రెండేళ్ల క్రితం కిలో రూ. 120కి లభించిన కందిపప్పు ఇప్పుడు రూ. 200లకు చేరుకుంది. సరకులు తెచ్చుకునేందుకు దుకాణానికి వెళ్లే వారు కంది పప్పు ధరను అడిగి తీసుకుంటున్నారు. ఎక్కువ ఉండటంతో సరకుల జాబితాలోంచి దాన్ని తొలగిస్తున్నారు.

595 ఎకరాల్లో తగ్గిన సేద్యం జిల్లాలో కందిసాగు ఏటా తగ్గుతోంది. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 2,969 ఎకరాల్లోనే పండించారు. ఈసారి రైతులు 2,374 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 595 ఎకరాల్లో సేద్యం తగ్గింది. గోదావరి, మూసీ, సాగర్ నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు ఎక్కువగా వరి వైపు మొగ్గుచూపుతున్నారు. అలాగే అంతర పంటగా పండించే కందిని తగ్గించేశారు. దీంతో ఉత్పత్తి తగ్గి ధర పెరుగుదలకు కారణమవుతోంది. మార్కెట్‌లోనూ కందులకు ధర క్వింటాకు రూ. 9వేలకు పైగా పలుకుతోంది. కొన్నిసార్లు గరిష్ఠంగా రూ. 11వేలు పలికిన సందర్భాలు కూడా ఉన్నాయి. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువగా డిమాండ్ ఉండటంతో ఆయా ప్రాంతాలకు వ్యాపారులు కందిపప్పు నిల్వ చేసి రవాణా చేస్తున్నారు. సామాన్యులపై భారం ప్రస్తుతం పప్పులతో పాటు కూరగాయల ధరలూ మండిపోతున్నాయి. చలి తీవ్రత కారణంగా దిగుబడి తగ్గడం, దూరప్రాంతాల నుంచి రవాణా భారం కావడంతో కూరగాయల కొరత ఏర్పడింది. ఫలితంగా వాటి ధరలు పెరగటంతో సామాన్యులకు భారంగా మారింది. ఇటు కూరగాయలు, అటు పప్పు వెలలు ఆకాశాన్నంటడంతో వంటకాలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.రైతులు ఆసక్తి చూపడం లేదు-ఫసియొద్దీన్, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి, సూర్యాపేటజిల్లాలో ఏటా కంది సాగు తగ్గుతోంది. దీంతో పప్పు ధరలు పెరుగుతున్నాయి. గతంలో పదెకరాలున్న రైతు కనీసం మూడెకరాల్లో కందులు పండించే వారు. ప్రస్తుతం సమృద్ధిగా ఉండటంతో వరి సాగు వైపు మొగ్గుచూపుతున్నారు.

# పరిశ్రమ చదువుపై ఆశ.. విద్యార్థులకు నిరాశ

తాండూరు : తాండూరు నియోజకవర్గంతోపాటు, చుట్టు పక్కల ప్రాంతాల యువత ప్రభుత్వ, ప్రైవేటు, స్వయం ఉపాధి రంగంలో స్థిరపడేందుకు తర్ఫీదు పొందేలా కేంద్ర ప్రభుత్వం వృత్తి శిక్షణ కేంద్రాన్ని (ఐటీఐ) మంజూరు చేసింది. ఎనిమిది సంవత్సరాలు గడిచినా నేటికీ తరగతులు ప్రారంభించని దుస్థితి నెలకొంది. వెరసి ఏటా వందలాది మంది యువకులు ప్రైవేటు కేంద్రాల్లో చేరుతూ వేలాది రూపాయల రుసుంలు చెల్లించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

రూ.4 కోట్ల మంజూరు

సర్కారు వనరుల్ని సమకూర్చినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు వృత్తి శిక్షణ అందకుండా పోయింది. తాండూరు మండలానికి 2016 సంవత్సరంలో ప్రభుత్వ ఐటీఐ మంజూరైంది. భవనాన్ని నిర్మించేందుకు రూ.4కోట్లు మంజూరయ్యాయి. జిన్‌గుర్తి వద్ద ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అప్పగించారు. ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడంతో నిధులు నిరుపయోగమయ్యాయి.

తాత్కాలికంగా సమకూర్చినా..

సొంత భవనం నిర్మించేదాకా తాత్కాలికంగా తరగతులు నిర్వహించేందుకు జిన్‌గుర్తి వద్ద రూ.2.82కోట్లతో నిర్మించిన భవనాల్ని జిల్లా పాలనాధికారి నారాయణరెడ్డి ఐటీఐకి కేటాయించారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో తరగతులు మొదలవుతాయని విద్యార్థులు, యువకులు సంబరపడ్డారు. ఈసారి కూడా తరగతులు ప్రారంభించకుండా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రూ.కోట్లు విలువజేసే భవనాల్ని కట్టబెట్టినా ఫలితం




లేకుండాపోయింది.

టెండరు ప్రక్రియకు వెనుకడుగు

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, విగణిత, వెల్డర్ శిక్షణకు సంబంధించి సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసింది. వీటిని ఐటీఐలో అమర్చేందుకు టెండరు ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. టెండరు దక్కించుకున్న సంస్థతో సామగ్రిని ఏర్పాటు చేయిస్తే ఢిల్లీ నుంచి వచ్చే కేంద్ర బృందం ఆమోదం తెల్పాక విద్యార్థుల చేరికలకు వీలుంటుంది. నిధులు మంజూరై ఏడాది దాటినా టెండరు ప్రక్రియ ఊసెత్తకుండా కమిషనర్ కార్యాలయం అధికారులు తాత్సారం చేయడంపై విమర్శలొస్తున్నాయి. టెండరు ప్రక్రియ నివేదికను ఒక్కరోజులో సమర్పించేందుకు సంయుక్త సంచాలకులు నగేష్, సహాయ సంచాలకులు భాస్కర్‌ను ఇటీవలే ఆదేశించినా లాభం లేకపోతోంది. దీంతో టెండరు నిర్వహించే దిక్కులేక తరగతులు మొదలవడం లేదు. ఐటీఐకి ఇద్దరు జూనియర్ సహాయకులు, ఇద్దరు అటెండర్లు ఖాళీగా ఉండి వెళ్తున్నారు. అధికారుల తీరుపై ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల పరిధిలో ఉంది-రామానుజ, ప్రిన్సిపల్, ఐటీఐ, జిన్‌గుర్తి

ఐటీఐకి కేటాయించిన భవనాల్లో నాలుగు కోర్సులకు సంబంధించి రూ.3కోట్లు విలువజేసే సామగ్రి అమర్చాల్సి ఉంది. టెండరు పిలిచి ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా ఉన్నతాధికారులను కోరాం. వారు సామగ్రిని సమకూర్చితే జూన్‌లో ప్రవేశాలకు ఆస్కారం ఏర్పడుతుంది.

# పప్పులు.. కూరలు.. నిప్పులాయే

హైదరాబాద్ : ఖరీఫ్-రబీ సీజన్‌లకు మధ్య ఉన్న కాలాన్ని ధరల కాలంగా పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పప్పులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో రూ.50 ఉన్న ఉల్లిగడ్డలు, టమాటాలు ఇప్పుడు రూ.30కి తగ్గినా పూర్వస్థాయికి తగ్గలేదు. కూరగాయలైతే కిలో రూ.70 నుంచి రూ.80 వరకూ పలుకుతున్నాయి. కందిపప్పు ధర రూ.40 నుంచి రూ.70 వరకూ పెరిగితే.. అదే దారిలో మిగతా పప్పుల ధరలూ పరుగులు పెడుతున్నాయి.

పప్పులకు రెక్కలు రెండు నెలల క్రితం రూ.150 వరకూ ఉన్న కందిపప్పు ధర నేడు రూ.220 వరకూ పెరిగింది. మిగతా పప్పుల ధరలు కూడా రూ.20 నుంచి రూ.30 వరకూ పెరిగాయి. ఇడ్లీ, దోశ వేసుకుందామంటే మినప పప్పు ధర నిప్పులు కక్కుతోంది. కిలో రూ.180 వరకూ ఉండి సామాన్యుడిని భయపెడుతోంది. రూ.వందకు దొరికే పెసరపప్పు కూడా రూ.140కి పైగా పలుకుతోంది.

కూరగాయలు కుతకుత

కిలో బీరకాయ రూ.80లు కాగా.. 10 రోజుల క్రితం వరకూ కిలో రూ.35లు ఉన్న బెండకాయ రూ.70లు అయ్యింది. దాదాపు చాలా



కూరగాయలు రూ. 70-80కి చేరాయి. ఇక కిలో అల్లం రూ.160 ఉండగా.. వెల్లుల్లి కిలో రూ.370 చొప్పున అమ్ముతున్నారు. రైతుబజారు ధరలు కిలో దగ్గర రూ.10 నుంచి 15 తక్కువగా ఉన్నా.. అక్కడ కూడా ధరలు మండుతున్నాయి.

బియ్యం బాబోయ్..

గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నా.. బియ్యం కొనలేక వినియోగదారుడు అవస్థలు పడుతున్నారు. నవంబరులో సోనామసూరి కిలో బియ్యం రూ.60 వరకూ ఉండగా.. డిసెంబరులో కిలో రూ.67 చొప్పున అమ్ముతున్నారు. దొడ్డు బియ్యం ధర కూడా కిలో రూ.50 నుంచి రూ.55ల వరకూ పలుకుతోంది. సోనామసూరి సన్నబియ్యమే పలు బ్రాండ్లు పెట్టి 25 కేజీల బస్తాలను రూ.1650 నుంచి రూ.1700లకు తక్కువ లేకుండా అమ్ముతున్నారు. నెల రోజుల్లో రూ.200లకు పైగా 25 కేజీల బస్తా దగ్గర పెరిగినట్టు కృష్ణనగర్‌లోని బియ్యం, పప్పుల హోల్‌సేల్ మార్కెట్ నిర్వాహకుడు గణేష్ చెప్పారు.

# కరవైన వసతులు.. భక్తుల ఇక్కట్లు



ధర్మపురి : రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన ధర్మపురి పుణ్యక్షేత్రంలో కనీస వసతులు కరవై భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు ఇక్కడకి వస్తుంటారు. ఇక్కడ కనీస మౌలిక వసతులు కరవయ్యాయి. భక్తులు ఉండటానికి ధర్మశాలలు, వాహనాలు పార్కింగు, తాగునీరు వసతులు కరవయ్యాయి. వాహనాల పార్కింగు విషయంలో ఇటు దేవస్థానం, అటు ధర్మపురి పురపాలక సంఘం తమ పరిధి కాదంటే తమది కాదనే రీతిలో వ్యవహరిస్తున్నారు.

తప్పని గదుల కొరత

ధర్మపురి దేవస్థానానికి ప్రతి శని, ఆది, బుధ, శుక్రవారాల్లో సుమారు పదివేల మంది గోదావరినది స్నానాలు, దైవ దర్శనాలకు తరలివస్తారు. గోదావరి నదిలో అరకొర సదుపాయాలున్నాయని, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు, తాగునీటి వసతులు కరవయ్యాయని భక్తులు వాపోతున్నారు. గోదావరి నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో మడుగుల్లో స్నానాలకు దిగి భక్తులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. భక్తులు ఆ మడుగుల్లోకి వెళ్లకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీంతోపాటు మరిన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, నీటి ట్యాంకుల నుంచి నీరు రావడం లేదని, తాగునీటిని శుద్ధిచేయకుండా నేరుగా నల్లా నీటినే సరఫరా చేస్తున్నారని భక్తులు కోరుతున్నారు.

పార్కింగ్ స్థలం ఏదీ

యేటా పురపాలక సంఘానికి వాహనాల పార్కింగు పన్ను ద్వారా రూ.43లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. నంది కూడలి వద్ద గేట్ ఏర్పాటు చేసిన గుత్తేదారు ప్రతి వాహనానికి రూ.50 పన్ను వసూలు చేస్తున్నారు. సరిపడా వసతులు కల్పించడంలో గుత్తేదారులు విఫలమవుతున్నారు. ప్రతిరోజు వందల వాహనాల్లో భక్తులు తరలి వస్తున్నారు. మంగళిగడ్డ, బ్రాహ్మణసంఘం, ఇతరచోట్ల రహదారి పక్కన వాహనాలు నిలుపుతున్నారు. ఇరుకైన రహదార్ల పక్కనే వాహనాలు నిలపడంతో వాహనాలు నడవడానికి ఇబ్బందిగా మారింది. పార్కింగు కోసం పన్ను వసూలు చేస్తున్నప్పటికీ కనీస వసతులు కల్పించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. నంది కూడలి నుంచి దేవస్థానం, దేవస్థానం నుంచి గోదావరినది రహదార్ల పక్కన వాహనాలు పార్కింగు చేస్తున్నారు.

నేరుగా బస్సు సౌకర్యం లేదు

ఉమ్మడి జిల్లా కేంద్రమైన కరీంనగర్ నుంచి నేరుగా ధర్మపురికి చేరేందుకు రవాణా వసతులు కరవయ్యాయి. జగిత్యాల మీదుగా ధర్మపురికి రావాల్సి వస్తోంది. కరీంనగర్ నుంచి నేరుగా బస్సును వయా రాయపట్నం మీదుగా నడిపించాలని భక్తులు కోరుతున్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదలను గతంలోనే పంపినా అధికారులు స్పందించడంలేదు.

సదుపాయాల కల్పనకు కృషి- సీహెచ్ రమేష్, పుర పాలక కమిషనర్

ధర్మపురిలో భక్తులకు కావాల్సిన సదుపాయాలను కల్పించేలా కృషి చేస్తున్నాం. పురపాలకం పక్షాన నదిలో స్వచ్ఛత, పరిశుభ్రతలపై చర్యలు తీసుకుంటున్నాం. వాహనాల పార్కింగ్ తాత్కాలికంగా మంగళిగడ్డ, బ్రాహ్మణసంఘం స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నాం. శాశ్వత పార్కింగ్ స్థలం ఏర్పాటుకు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

# పల్లె పోరుకు కసరత్తు




సిరిసిల్ల : పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం వచ్చే నెల31తో ముగియనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. ప్రభుత్వం పల్లె పోరుకు ఎప్పుడు ప్రకటన వెలువరించినా తాము సిద్ధమనే తీరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయిదేళ్ల క్రితం అనుసరించిన రిజర్వేషన్లనే ఇప్పుడు కొనసాగించనున్నారు. వీటికి సంబంధించిన వివరాలు ఇప్పటికే మండలాల్లో ఉన్నాయి. ఎన్నికల ప్రకటన వెలువడే నాటికి సిద్ధంగా ఉన్న ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకొంటారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మార్పులు, చేర్పుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ ఫిబ్రవరి 6తో పూర్తవుతుంది. 8న తుది జాబితాను ప్రకటిస్తారు. ఈలోపు ఎన్నికల ప్రకటన వెలువడితే అసెంబ్లీ తుది ఓటరు జాబితానే ఉపయోగించే అవకాశాలున్నాయి. అయిదేళ్లలో జిల్లాలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. పట్టణాల్లోని ఓటర్లు పల్లెలకు, పల్లెల్లో ఒక చోట నుంచి మరో చోటుకు మారారు. ఇదే కాకుండా జిల్లాలో ఇటీవల కొత్త అంశం తెరపైకి వచ్చింది. పురపాలికల్లో విలీనమైన గ్రామాలను మళ్లీ పంచాయతీలుగానే కొనసాగించే విధంగా తీర్మానం చేయాలని ఇటీవల ఎమ్మెల్యే ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు చెప్పారు. దీనిపై కూడా ఆయా గ్రామాల్లో చర్చలు జరుగుతున్నాయి. మారిన ఓటర్లుసిరిసిల్ల పురపాలికలోని నిరుపేదలకు గత ప్రభుత్వం తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో 1,320 రెండు పడక గదుల ఇళ్లను నిర్మించింది. వాటిని దశల వారీగా పంపిణీ చేశారు. ఇక్కడ నివాసముండే కుటుంబాల ఓట్లన్నీ కలిపి మూడు వేల పైనే ఉంటాయని అంచనా. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వీరి ఓటు హక్కును సిరిసిల్లలోని పలు పోలింగ్ కేంద్రాల్లో వినియోగించుకున్నారు. మండెపల్లి పంచాయతీలో సుమారు ఏడు వందల గృహాలు, 2,400 మంది వరకు ఓటర్లు ఉంటారు. వీరితో పోల్చితే రెండు పడకల గృహ సముదాయంలో ఉంటున్నవారే ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ నివాసముంటున్న వారి ఓట్లు మండెపల్లి పంచాయతీ పరిధిలోకి మార్పు జరగలేదు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. స్థానికత సమస్యతోపాటు వసతులు సమకూర్చడం, నిర్వహణ ఖర్చులకు చిన్న పంచాయతీకి భారంగా మారుతోంది. అందుకే అధికారులెవరూ పెద్దగా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో రుద్రారం గ్రామానికి చెందిన 75 కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లు పంపిణీ చేశారు. వీరిలో సగం కుటుంబాలు తమ ఓటు హక్కును ఇక్కడి పంచాయతీలోకి మార్చుకున్నారు. ఇంకా 35 కుటుంబాల ఓట్లు ఇప్పటికీ రుద్రారంలోనే ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యేలోపు మార్చాల్సి ఉంది.

ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్, భారాసలు పట్టణంలో విలీనమైన ఏడు గ్రామాలను తిరిగి పంచాయతీలుగా మార్చుతామని హామీలు ఇచ్చాయి. దీనిపై ఇటీవల కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కేటీఆర్ చర్చించి ఆ దిశగా తీర్మానాలు చేయాలని సూచించారు. అయిదేళ్లలో విలీన గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించి, భూముల విలువ పెరిగింది. అభివృద్ధి అంతంత మాత్రంగానే జరిగింది. అటు వేములవాడ పట్టణంలోని విలీన గ్రామాల్లోనూ కదలిక వచ్చింది. విలీన గ్రామాల ప్రజాభిప్రాయం మేరకు జరగాలి. కౌన్సిల్ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ప్రక్రియ జరగాలంటే మరింత సమయం పడుతుంది.

# జనరల్ ఆసుపత్రిలో వైద్యాధికారులు అప్రమత్తం

కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇటీవల రెండు కొవిడ్ కేసులు నమోదు కావడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా మాస్కు ధరిస్తున్నారు. రోగులూ ధరించేలా అవగాహన కల్పిస్తున్నారు. లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతానికి రాపిడ్ పరీక్షలు కాకుండా ఆర్‌టీపీసీఆర్ చేస్తున్నారు. ఆసుపత్రిలో మిగతా ఎవరికీ లక్షణాలు లేకపోవడంతో పరీక్షలు నిర్వహించలేదు. అధిక మంది ఉండకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ఓపీ రిజిస్ట్రేషన్ చేయించాలని సిబ్బందికి సూచించారు. వైరస్ లక్షణాలు ఉన్న వారికి వెంటనే పరీక్షలు నిర్వహించి చికిత్స అందించేందుకు వైద్యాధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.. - వీరారెడ్డి, సూపరింటెండెంట్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి



కొవిడ్-19 సబ్ వేరియంట్ ప్రమాదకరమైన వైరస్ కాదు. దీని బారిన పడిన వారు కోలుకునే శాతం ఎక్కువగానే ఉంది. కానీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గుంపులుగా ఉన్న చోట మాస్కులు ధరించాలి. నాలుగైదు రోజులు దగ్గు, జలుబు ఉంటే ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలి. చికిత్స అందించడానికి వైద్య బృందం అప్రమత్తంగా ఉంది. ఆసుపత్రిలో ఏవైనా ఇబ్బందులుంటే మా దృష్టికి తీసుకురావాలి.

# నీరున్నా నిష్ఫలం.. తడవని పొలం!

పరిగి : వేలాది ఎకరాలకు సాగు నీటిని అందించి పరిగె భూములను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో 'లఖ్నాపూర్' ప్రాజెక్టును 5 దశాబ్దాల క్రితమే నిర్మించారు. అంతేకాదు దీనిని మినీ ట్యాంక్‌బండ్ ప్రాజెక్టు అసంపూర్తిగా నిలిచింది. నియోజకవర్గంలో ఇదే ప్రధాన రిజర్వాయర్. దశాబ్దాలుగా మరమ్మతులు లేక కాలువలు పూడుకు పోయాయి. కొత్త ప్రభుత్వం హయాంలోనైనా ప్రాజెక్టు వృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాడలేని మినీ ట్యాంక్ బండ్

పరిగి మండలంలోని ఇతర ప్రాంతాల్లో ప్రాజెక్టు, దాటి చుట్టూ చక్కటి ఆహ్లాదకర వాతావరణం ఎక్కడా లేకపోవడంతో అధికారులు లఖ్నాపూర్‌ను 'మినీ ట్యాంక్ బండ్'గా తీర్చిదిద్దేందుకు ఆరేళ్ల క్రితం చర్యలు చేపట్టారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6.81కోట్లను కేటాయించింది. ఈ నిధులతో బోటింగ్ ప్లాట్‌ఫాం, గణేష్ ఘాట్, వినాయక ఘాట్‌ల నిర్మాణాలతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించింది. వీటి పనులు ముగిసినా బోటింగ్ అమలు మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. పట్టించుకునే వారులేక కట్ట పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది.

ముందుకురాని కూలీలు..

జాతీయ ఉపాధి హామీ పథకం కింద కాలువలకు మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే యంత్రాలతోనే సాధ్యమవుతుందని, కూలీలు ముందుకు రాలేదు. దీంతో పనులు ఆగిపోయాయి.

బోల్టులు ఊడిపోతున్నాయి

ప్రాజెక్టుపై నిర్మించిన నడకదారి (ఇనుప రెయిలింగ్) ప్రస్తుతం



శిథిలావస్థకు చేరింది. దీని పొడవు 70మీటర్లు ఉంది. ఐదున్నర దశాబ్దాల క్రితం దీనిని నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు దాని మరమ్మతు పనులేవీ పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ ఇనుప బోల్టులు ఊడిపోయాయి. ఇరువైపులా ఉన్న చివర ఇనుప మెట్లు కూడా ఊగిసలాడుతున్నాయి.

15 శాతం నీరు వృథా

ఈ ప్రాజెక్టు నియోజకవర్గ కేంద్రానికి కేవలం ఆరు కిలో మీటర్ల దూరంలోనే ఉంది. జలకళను సంతరించుకుంటే సాగు, తాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదు. పరిగి, వికారాబాద్ నియోజక వర్గాల్లోని 8 గ్రామాల ప్రజలకు ఇది వరప్రదాయిని. తూములు సక్రమంగా లేకపోవడంతో నీరు వృథాగా పోతుండగా ప్రస్తుతం 16 అడుగుల నీరున్నా పొలాలకు చేరడంలేదు.

ప్రాజెక్టుతోపాటు కుడి, ఎడమ కాలువలను నిర్మించారు. మొదటి పదేళ్లు నిర్వహణ బాగుండి నీరు సద్వినియోగమైంది. తరువాత పర్యవేక్షణ, మరమ్మతులు కొరవడి కాలువలు పూడుకున్నాయి. పిచ్చిమొక్కలు మొలిచి కాలువలు గుర్తుపట్టలేనంతగా మారాయి. ప్రస్తుతం దాదాపు 15 శాతం నీరు వృథా అవుతోంది.

రూ.23లక్షలతో ప్రతిపాదనలు- కెవి.క్రిష్టారెడ్డి, డీఈఈ, నీటిపారుదల శాఖఈ ప్రాజెక్టును సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ప్రమాదకరంగా మారిన నడకదారిని బాగు చేసేందుకు రూ.23లక్షలతో ప్రతిపాదనలు పంపాం. దాని ఎత్తుపెంచడంతో పాటు రక్షణ చర్యలు కూడా చేపడతాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

# విద్యుత్ భవనాల నిర్మాణం వేగవంతం

తాండూరు: జిల్లాలోని తాండూరు, వికారాబాద్ కేంద్రాలుగా రూ.5.5 కోట్ల వ్యయంతో చేపడుతున్న విద్యుత్తు శాఖ భవనాల పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో నాలుగు నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. దీంతో చాలా ఏళ్ల నుంచి సొంత భవనాలు లేక ఎదురౌతున్న ఇబ్బందుల నుంచి సిబ్బందికి ఉపశమనం కలుగనుంది.

తాండూరులో రూ.1.5 కోట్ల వ్యయం

జిల్లాలో వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఉన్న తాండూరులో విద్యుత్తు ఉప కార్యనిర్వాహక ఇంజినీరు కార్యాలయానికి సొంత భవనం లేదు. అరకొర వసతులతో ఉన్న అద్దె భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు సమస్యలు వివరించడానికి వచ్చే వినియోగదారులకు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో ఏడాది కిందటే అప్పటి ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.1.5 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులు ఆధారంగా మూడు నెలల కిందటే పనులు ప్రారంభమయ్యాయి. మరో నాలుగు నెలల్లో భవనం పూర్తి



కానుంది. అద్దెభవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సొంత భవనంలోకి వస్తారు.

ముఖ్యమైన పనులు ఇక్కడి నుంచే..

జిల్లా విద్యుత్తు ఎస్ఈ కార్యాలయానికి సొంత భవనం లేదు. అద్దెభవనంలో కొనసాగుతుంది. జిల్లాలోని ఏఈలు, ఏడీఈలు, డీఈఈలతో పాటు ఇతర సిబ్బంది ఎస్ఈ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చి పోతుంటారు. జిల్లాకు సంబంధించిన శాఖా పరమైన ముఖ్యమైన పనులు ఇక్కడి నుంచే సాగుతాయి. సమీక్షలు జరుగుతాయి. అద్దెభవనంలో విధులు నిర్వహించడంలో ప్రస్తుతం సిబ్బంది అవస్థలు పడుతున్నారు. దీంతో ఏడాది కిందట సొంత భవనం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. పనులు వేగంగా జరుగుతున్నాయి. నాలుగు నెలల్లో రానుందని ఎస్ఈ జయరాజు తెలిపారు.

# వీధి వ్యాపారులకు రుణాల దన్ను

కరీంనగర్ : కొవిడ్-19 లాక్‌డౌన్ కారణంగా చిరు వ్యాపారులు బజారున పడ్డారు.. తిరిగి వ్యాపారాలు చేసుకోవడానికి పైసా లేక.. అప్పులు దొరకక అవస్థలు పడుతున్న వేళ వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి, ఆత్మనిర్భర్ పథకాన్ని ప్రారంభించారు.. పట్టణాలు, నగరాల్లో గుర్తించిన చిరు వ్యాపారులకు రుణాలు ఇచ్చి ఆర్థికంగా దన్నుగా నిలిచారు.. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రారంభించి మూడు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి కావడంతో జూన్ 1 నుంచి 3 వరకు దిల్లీలో ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా కథనమిది.. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 పురపాలికలు, 2 నగరపాలికల్లో 65,246 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. రోడ్ల మీద, ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయలు, అల్పాహార కేంద్రాలు, వస్త్రాలు, నిత్యావసరాలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కరోనా మహమ్మారి వీరి వ్యాపారాలను బాగా దెబ్బతీసింది. లాక్‌డౌన్ తర్వాత వ్యాపారాలు చక్కదిద్దుకునేందుకు చిరు వ్యాపారులు అష్టకష్టాలు పడ్డారు. ఉపాధి లేక, జీవనం గడవక అవస్థలు పడుతున్న చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పించింది.

మొదట్లో నిరాకరించి : పీఎం స్వనిధి, ఆత్మనిర్భర్ కింద వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా నేరుగా రుణాలు అందించేందుకు ముందుకొచ్చారు. రూ.10 వేలు ఖాతాలో జమ చేస్తుండగా ప్రతి నెలా వడ్డీతో సహా కట్టాల్సి ఉండటంతో చిరు వ్యాపారులు మొదట్లో నిరాకరించారు. ఇచ్చే మొత్తం సరిపోదనే భావనతోనే ఉండేవారు. పురపాలక అధికారులు అవగాహన కల్పించడంతోపాటు దగ్గరుండి రుణాన్ని ఇప్పించారు. తర్వాత లక్ష్యాన్ని విధించడం, ఈ మొత్తం రెట్టింపు అవుతుందనే ఆశతో రుణాలు తీసుకోవడానికి చిరు వ్యాపారులు ఆసక్తి



చూపించారు.రూ.10 వేల నుంచి రూ.50 వేలకు.. : పీఎం స్వనిధి కింద మొదటి విడతలో రూ.10 వేలు ఖాతాల్లో జమ చేస్తే, ఈ మొత్తాన్ని ఏడాదిలోగా వడ్డీతో బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. సక్రమంగా చెల్లించిన వారికి మళ్లీ రుణాలు ఇచ్చేందుకు స్వయంగా బ్యాంకర్లే ముందుకొచ్చారు. దాంతో రెండో విడతలో రూ.20 వేలకు అర్హత కల్పించారు. ప్రస్తుతం మూడో విడతలో రూ.50 వేలు అందించేందుకు లక్ష్యాన్ని విధించడంతో అర్హులైన వీధి వ్యాపారులు కూడా ముందుకొస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ మొత్తం మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లుగా చెబుతున్నారు. పీఎం స్వనిధి అమలులో రెండో విడతలో కరీంనగర్ నగరపాలక సంస్థ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండగా, దేశంలో పది లక్షల లోపు జనాభాలోని కార్పొరేషన్లలో రెండో స్థానంలో నిలిచింది. మూడో విడతలో కూడా లక్ష్యాన్ని సాధించేలా కసరత్తు చేస్తున్నారు.

అడగకముందే రుణం మంజూరు

రోడ్డుపై దుస్తులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తాను. వీధి వాపార గుర్తింపు కార్డు ఇచ్చారు. ఆ సమయంలో రూ.10 వేలు రుణం ఇప్పించారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో చెల్లించడంతో రూ.20 వేలు ఇచ్చారు. ఆ మొత్తాన్ని కూడా చెల్లించడంతో మూడోవిడతకు దరఖాస్తు చేయమని మున్సిపల్ అధికారులు ఫోన్ చేశారు. బయట ఫైనాన్స్ కంటే నయమే. అడగకముందే రుణం మంజూరు చేశారు.

రాజేశం, కరీంనగర్

సమయానికి ఆదుకుంది

లాక్‌డౌన్ సమయంలో పైసలు లేక, పని చేసుకుందామంటే పెట్టుబడి లేక ముప్పు తిప్పలు పడ్డాం. కుటుంబ పోషణ భారంగా మారింది. ఆ సమయంలో తక్కువ వడ్డీతో ఈ రుణం ఆదుకుంది. మూడు విడతలుగా రుణం తీసుకొని చెల్లించా. బ్యాంకు అధికారులు మళ్లీ రుణం ఇస్తామని చెబుతున్నారు. చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తీసుకోవడం లేదు. అంజయ్య, చెరుకు జ్యూస్ సెంటర్, కరీంనగర్

# మామిడి రైతుకు నష్టాల చేదు

నల్గొండ : మామిడి రైతులు ఈ సంవత్సరం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఎన్నడూ లేనివిధంగా కనీసం పెట్టుబడులు కూడా చేతికందకపోవడంతో మామిడి చెట్లను తొలగించాలనే యోచన చేస్తుండటం ఆందోళనకరంగా మారింది. జిల్లాలో 10,720 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేశారు. మార్చి, ఏప్రిల్ మాసాల్లో కురిసిన అకాల వర్షం.. వడగళ్లు, వీచిన బలమైన గాలులతో 30 శాతానికి పైగా కాయలను నేలరాలడంతో రైతులు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. సాధారణ పరిస్థితుల్లో జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 1.05 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి ఉంటుంది. ఈ సారి 35 వేల మెట్రిక్ టన్నుల కాయలను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు. సీజన్ ముగియనుండగా మరో మూడు, నాలుగు వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ లెక్కలను చూస్తే కాపు తగ్గినట్లు తెలుస్తోంది.

వెంటాడిన చీడపీడల బెడద

ఈ సారి మామిడిపైనా చీడపీడల బెడత గణనీయంగా పెరిగింది. తేనెమంచు, బూడిద తెగులు, ఇతరత్రా పురుగులు, తెగుళ్లు తీవ్రంగా ఆశించడంతో కాయలపై మంగు మచ్చలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఎగుమతి తగ్గిందంటూ దిల్లీ వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో ధర అమాంతం తగ్గింది. జిల్లాలో అధికంగా సాగులో ఉన్న బంగినపల్లి రకానికి గతేడాది ఈ సమయానికి క్వింటాకు రూ.3000–4300 ధర ఉండగా ఈసారి రూ.1200–2800 మాత్రమే పలికింది. మంగు మచ్చలున్న కాయలను వేరుచేసి రూ.500–800 ధరకు కొనుగోలు చేస్తున్నారు.

120 ఎకరాల్లో తోటలు మాయం

జిల్లాలో దిగుబడి, ధర గణనీయంగా తగ్గడంతో కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు దిగులు చెందుతున్నారు. మామిడికి వాతావరణ ఆధారిత బీమాను అమలు చేయనందున ప్రకృతి విపత్తుల నష్టానికి ఆర్థిక ఆసరా దక్కలేదు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో దాదాపుగా 120 ఎకరాల్లో మామిడి తోటలను నరికివేసి ఇతర పంటల సాగుకు మళ్లుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. పెన్‌పహాడ్ మండలం లింగాలలో 30, చీదెళ్లలో 10, కోదాడ మండలం గుడిబండలో 30, మునగాలలో 30, నూతనకల్ మండలం ఎర్రపహాడ్‌లో 20 ఎకరాల్లో మామిడి తోటలను రైతులు నరికివేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే నాలుగైదేళ్లలో 70 శాతం వరకు మామిడి తోటలు మాయమయ్యే ప్రమాదముంది.

ప్రతిపాదనలు పంపాంరామారావు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేటజిల్లాలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మామిడి రైతులకు పరిహారం అందించే విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే బాధితులకు పరిహారం అందజేస్తాం. మొదటి విడతలో సుమారు 1,400 ఎకరాల్లో మామిడి తోటలు నష్టపోయాయి. ఆరుగాలం కష్టపడి సస్యరక్షణ చర్యలు తీసుకున్నా మామిడి తోటలకు కనీసం పెట్టుబడులు రావడం లేదు. మార్కెట్‌లో దళారులు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు ధర రాక ఈసారి నష్టపోయిన పెన్‌పహాడ్ మండలానికి చెందిన పలువురు రైతులు 40 ఎకరాల్లో మామిడి తోటలను నరికివేశారు.

# మేల్కోకపోతే ముప్పే!



డోర్నకల్ : వర్షాకాలం ప్రారంభం కానుంది. ఇటీవల వేసవిలో కురిసిన వర్షాలకు మురుగు కాలువలు పొంగిపొర్లి వీధులు జలమయమై ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు డోర్నకల్, మరిపెడ, తొర్రూరు పురపాలికల్లో కాలువల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో పలుచోట్ల రహదారులపై మురుగు నీరు చేరుతుంది. కొత్త మున్సిపాలిటీల అభివృద్ధి కోసం తొలుత ఒక్కొక్క పురపాలిక సంఘానికి ప్రభుత్వం రూ.20 కోట్లు చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులతో డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మున్సిపాలిటీలలో అవస్థలు తీరుతాయని భావించినా ఫలితం అంతంత మాత్రమే. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో పర్యటించినప్పుడు మహబూబాబాద్ మున్సిపాలిటీకు రూ.50 కోట్లు, మిగిలిన మూడు పురపాలికలకు రూ.25 కోట్లు, ప్రతి పంచాయతీకి రూ.10 లక్షలు చొప్పున కేటాయించిన నిధులతోనైనా అభివృద్ధి జరుగుతుందేమోనని ఎదురు చూస్తున్నారు.

లోపభూయిష్ట పనులతో కష్టాలు

జిల్లాలో కొత్తగా 2018లో డోర్నకల్, మరిపెడ, తొర్రూరు పట్టణాలు పురపాలిక హోదా పొందాయి. పట్టణాల్లో అంతర్గత వీధులు, ప్రధాన వీధుల వెంబడి మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉండటం ప్రజల పాలిట శాపంగా మారింది. ఇప్పటికీ మురుగు కాలువల్లేని వీధులున్నాయి. కొన్నిచోట్ల ఏళ్ల కిందట కట్టిన కాలువలు పూర్తిగా శిథిలంగా మారాయి.

దృష్టి పెడితే మేలు

జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ పురపాలికల్లో భారీ వర్షాలకు అవాస ప్రాంతాలు ముంపునకు గురవుతుండటం అందరిని కలవర పరుస్తోంది. గత వర్షాకాలంతో పాటు ఇప్పుడు వేసవిలో కురిసిన వర్షాలకు ఎదురైన చేదు అనుభవాల నుంచి అధికారగణం గుణపాఠం నేర్చితే బాగుంటుంది. శివారు ప్రాంతాల ముంపు, వీధులు జలమయం వంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగు చర్యలు తీసుకోవాలి. అవసరమైన ప్రణాళిక రూపకల్పన జరగాలి.

శివారు ప్రాంతాల్లో ..

ఏటా వర్షాలు కురిసినప్పుడల్లా మహబూబాబాద్ పురపాలిక పరిధిలోని పలు వార్డులు, శివారు ప్రాంతాలు ముంపునకు గురవుతుంటాయి. ప్రధానంగా పట్టణంలోని 18వ వార్డులో గల కొంత భాగం, నిజాం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని గోపాలపురం ముంపు బారిన పడుతున్నాయి. ధర్మన్న కాలనీలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలోకి నీరు ప్రవేశిస్తుండటంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య గతంలో అధికారుల దృష్టికి వెళ్లింది. అయినప్పటికీ పరిష్కారంపై ఎవరూ శ్రద్ధ చూపలేదు.

దీర్ఘకాలిక ప్రణాళికతోనే ప్రయోజనం

తొర్రూరు పురపాలిక పరిధిలోని శివారు ప్రాంతాలు భారీ వర్షాలకు ఏటా ముంపునకు గురవుతున్నాయి. తొర్రూరులోని టీచర్స్ కాలనీ పరిసరాలు, వీరప్పనగర్ శివారు ప్రాంతాలు జలమయం అవుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలోని నూతన కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మన గ్రోమోర్ కేంద్రం నుంచి పాల కేంద్రం వరకు ప్రధాన రోడ్డు ప్రక్కన మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైకి వస్తుంది. తాత్కాలిక చర్యలు చేపడుతుండటంతో ప్రయోజనం ఉండటం లేదు. దీర్ఘకాలిక ప్రణాళిక అమలు పరచాలని తొర్రూరువాసులు కోరుతున్నారు.

అలుగుపడితే వరదే

డోర్నకల్ శివారు జయపురంలో ఆవాసాల మధ్య కొర్లకుంట చెరువు ప్రమాదకరంగా ఉంది. అలుగు పడితే నీరు మొత్తం ఇందులోకి చేరుతుంది. గతంలో జయపురం, రైల్వే క్వార్టర్లు, నెహ్రూ వీధి ముంపునకు గురయ్యాయి. ఈ కాలువలో ఇప్పటిదాక పూడిక తీయలేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వార్డు కౌన్సిలరు బసిక అశోక్ తెలిపారు. చిన్నపాటి వర్షానికే డోర్నకల్‌లోని కుందోజు వారి వీధి జలమయమవుతోంది. పట్టణంలో ముంపు నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని పుర కమిషనర్ మున్వర్‌అలీ తెలిపారు. ఇప్పటికే కొంత మంది కౌన్సిలర్లు సమస్య తీవ్రత గురించి తన దృష్టికి తీసుకొచ్చారన్నారు.

మరిపెడలో అంతంతే!

మరిపెడ పట్టణంలో కార్గిల్ కూడలి నుంచి వరంగల్ మార్గంలో జాతీయ రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే కార్గిల్ కూడలిలో చెరువును తలపించేలా మురుగు నీటితో పాటు వర్షపు నీరు చేరుతోంది. దీంతో పలుమార్లు వాహనాల రాకపోకలు సైతం స్తంభించాయి. రహదారిపై గంటల తరబడి నీరు నిల్వ ఉండి గుంతలమయంగా మారుతోంది. పట్టణంలోని గిరిజన ఆవాస ప్రాంతాల్లోని వీధుల్లో అంతర్గత రోడ్లు నిర్మించి మురుగు కాలువల ఏర్పాటు చేయకపోవడంతో సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయి. గ్యామాతండ, పూలబజార్, గాంధీ బజార్ ఎస్సీ కాలనీ సీతారాంపురం, కొత్తతండా, బొత్తలతండాలో మురుగు కాలువల సుమారు 8 వేల మీటర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

# ప్రగతి పరుగు!

కరీంనగర్ : ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పోరాటాన్ని సాగించిన ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి విషయంలో ప్రత్యేక ముద్ర కనిపిస్తోంది.. పథకాల ద్వారా అందిన సంక్షేమంతోపాటు ప్రత్యేకత నిలిపే అభివృద్ధి కూడా సాకారమైంది.. సాగుకు దన్నుగా నిలిచేలా ప్రాజెక్టులు.. విద్యా రంగంలో తెలంగాణ మార్కు చూపించేలా కేజీ టు పీజీ ప్రాంగణంతోపాటు వైద్య సేవల మెరుగుకు వైద్య కళాశాలల ఏర్పాటు రాష్ట్ర ఆవిర్భావం తరవాత ఉమ్మడి జిల్లాకు వన్నె తెస్తున్నాయి.. రేపటి నుంచి తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు నాలుగు జిల్లాలు ముస్తాబైన నేపథ్యంలో ఇన్నాళ్లు దరిచేరిన అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆశిద్దాం..

చదువుల అడ్డా.. 'కేజీ టు పీజీ'.!

రాష్ట్రంలో కేజీ టు పీజీ హామీని నెరవేర్చేలా అక్షర ఖ్యాతిని అందించిన బడి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేటలో నెరవేరింది. గత విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ అంగన్వాడీ నుంచి పీజీ విద్య వరకు చదువును అందించే విద్యానిలయంగా ఇది భాసిల్లుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయ స్వప్నంగా పేరొందిన కేజీ టు పీజీ ప్రాంగణాన్ని చిన్నపాటి విశ్వవిద్యాలయాన్ని తలపించేలా లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. కిండర్ గార్డెన్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రాంగణమిది. ఇక్కడ మొత్తంగా 2,500ల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పలు సంస్థలు చేసిన సాయం, ప్రభుత్వ నిధులు దాదాపుగా రూ.8.5 కోట్లు ఖర్చు పెట్టి చూడచక్కని సౌకర్యాలు, వసతులతో ఆహ్లాదభరితమైన బడిగా నిర్మించారు. రెండేళ్ల నుంచి ఆరేళ్ల వరకు వయస్సున్న వారికి అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటలతో 12 గదుల్లో ప్రత్యేక బోధనను అందిస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఇదే ప్రాంగణంలో ఉన్నాయి. జూనియర్, డిగ్రీ, పీజీలో పలు కోర్సులతోపాటు దూరవిద్యకోర్సులను అందుబాటులోకి తెచ్చారు. అతిపెద్ద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ఒకేసారి 100 మంది కూర్చునే సౌకర్యాన్ని కల్పించారు. నైపుణ్య శిక్షణను అందించే కేంద్రాన్ని ఏర్పాటు చేసి కుట్టు మిషన్‌తోపాటు ఇతర కులవృత్తులకు చేయూతనిచ్చే సౌలభ్యాన్ని ఇక్కడి బడిలో అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో భవిష్యత్తు చదువుల లోకానికి దీన్ని ఒక నమూనాగా మార్చారు.

వైద్య కళాశాలలతో మేలుప్రజారోగ్యానికి పెద్దపీట వేసేవిధంగా సర్కారు దవాఖానాలు ఇంతకింతకు బలోపేతమవుతున్నాయి. 9 ఏళ్లలో వైద్య చికిత్సల పరంగా ఊహించని సౌకర్యాలు, సౌలభ్యాలు రోగులకు చేరువయ్యాయి. ఈ సేవలకు అనుబంధంగా కొత్త వైద్య కళాశాలలు నాలుగు జిల్లాలకు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల వ్యవధిలోనే కరీంనగర్, సిరిసిల్ల, రామగుండం, జగిత్యాలలో వైద్య కళాశాలలను మంజూరు చేసి ఇక్కడి ప్రజల చిరకాల కోరికను తీర్చింది. బోధనేతర సిబ్బంది, వైద్య సిబ్బంది నియామకాలు జిల్లాల్లోని వైద్యసేవల్ని మరింత బలోపేతం చేయనున్నాయి.

జలకళనద్దిన కాళేశ్వరం

ఎస్సారెస్పీ కాలువలు ఉన్న ప్రాంతం తప్పితే మిగతా చోట్ల సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్న ఉమ్మడి కరీంనగర్‌లో సరికొత్త జలదృశ్యం ఆవిష్కృతమైంది. ఒకప్పుడు కరవు కోరల్లో చివరి తడి నీటి కోసం ఆందోళనలు చేసిన గడ్డ.. ఇప్పుడు జలాశయాల ఖిల్లాగా మారిపోయింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణం జరిగింది ఉమ్మడి జిల్లా పరిధిలోనే. రూ.లక్ష కోట్లతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు తొలి సాగునీటి ఫలాలు ఉమ్మడి జిల్లాకు అందాయి. మేడిగడ్డ (లక్ష్మీ బ్యారేజీ) నుంచి ఎత్తిపోసే నీరు అన్నారం (సరస్వతి) బ్యారేజీ మీదుగా పెద్దపల్లి జిల్లా సుందిళ్ల (పార్వతి) బ్యారేజీ, పంప్‌హౌజ్‌ల నుంచి ఎల్లంపల్లికి చేరుతుంది. అటు నుంచి నందిమేడారం, గాయత్రి పంప్ హౌజ్ మీదుగా మధ్యమానేరు జలాశయానికి వెళ్తాయి. సుందిళ్ల (పార్వతి) బ్యారేజీని మంథని మండలం కాసిపేట శివారులో నిర్మించగా జలాశయంలో 8 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. సమీపంలోని గోలివాడ వద్ద నిర్మించిన పంప్‌హౌజ్ ద్వారా ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోస్తారు. తెలంగాణ ఏర్పాటు తర్వాతే బోయినపల్లి మండలంలోని మధ్యమానేరు జలాశయం నిర్మాణం వేగంగా పూర్తి చేసుకుంది. నీటి సామర్థ్యం 25 టీఎంసీలు కాగా, ఈ జలాశయం ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చెరువులన్నింటిని నింపడంతో ఈ ఒక్క జిల్లాలోనే దాదాపు 2 లక్షల సాగుకు ఆధారమవుతోంది. రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్ నుంచి వచ్చే నీటితో కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాలకు కాళేశ్వరం తొలిఫలాలు అందాయి.

2017 వానాకాలంలో 6 లక్షల ఎకరాలు సాగైతే గత వానాకాలంలో కాళేశ్వరం జలాల పుణ్యమా అని దాదాపుగా 10లక్షల ఎకరాల్లో పలురకాల పంటల్ని రైతులు సాగుచేశారు.

కాళేశ్వరం జలాలతో వరద కాలువ నుంచి ఎస్సారెస్పీ(శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్)కు పునరుజ్జీవ పథకం ద్వారా నీళ్లను అందించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్, మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావు పేటల వద్ద పంప్‌హౌజ్‌లను నిర్మించారు. వరద కాలువలోకి వీటి ద్వారా ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్‌ను అవసరమున్నప్పుడు చేస్తున్నారు. దీని ద్వారా వరద కాలువలో అటు ఎస్సారెస్పీ ఇటు కాళేశ్వర జలాలు ఉండటంతో సమీప గ్రామాల సాగుకు ఇది జీవనాధారమవుతోంది.

# ఆ అధికారి రూటే.. సపరేటు..!

నల్గొండ : రాజధానికి దగ్గరగా ఉండటంతో ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. అనుమతుల్లేకుండా విచ్చలవిడిగా సాగుభూములను వెంచర్లుగా మారుస్తున్నారు. వీటికి సదరు అధికారి మద్దతుగా ఉండటంతో స్థిరాస్తి వ్యాపారులు ఆడింది ఆటగా సాగుతోంది. ఇక్కడ అక్రమాలకు పాల్పడుతున్నారని మండల ధరణి ఆపరేటర్‌ను, కంప్యూటర్ ఆపరేటర్‌ను ఇటీవలే జిల్లా ఉన్నతాధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. అయితే రెండు, మూడు రోజుల్లోనే సదరు కంప్యూటర్ ఆపరేటర్‌ను తిరిగి అదే ప్రాంతానికి బదిలీ చేయాలని ఓ నేత ఒత్తిడి చేయగా.. జిల్లా అధికార యంత్రాంగం ఆ ప్రతిపాదనకు ఒప్పుకోలేదని తెలిసింది. ఇక్కడ జరిగే అక్రమాలకు నియోజకవర్గ ప్రజాప్రతినిధి మద్దతు ఉందనేది బహిరంగ రహస్యం. ఈ కారణాలతోనే సదరు అధికారిని ఇక్కడి నుంచి బదిలీ చేయడానికి ఉన్నతాధికారులు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

ఇవిగో దృష్టాంతాలు..

ఓ మాజీ ఎమ్మెల్యేకు మండల కేంద్రం సమీపంలో సుమారు 30 ఎకరాల వరకు భూమి ఉంది. దీనిని కొంత కాలం క్రితం హైదరాబాద్‌కు చెందిన వారికి విక్రయించారు. ఈ స్థలంలో వారు వెంచర్ నిర్మాణం చేపట్టారు. గ్రామ కార్యదర్శిని వెంచర్ నిర్మాణ అనుమతుల గురించి అడగ్గా.. తమను సంప్రదించలేదని సదరు అధికారి వెల్లడించడం గమనార్హం. ఇలా ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్ల నిర్మాణం సాగుతున్నా అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ కొసమెరుపు ఏంటంటే వెంచర్ నిర్మాణం చేపడుతున్న స్థలంలో చెక్‌డ్యాంలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వ భూమిలోనే చెక్‌డ్యాంలను సర్కారు నిర్మించిందనే వాదనలుండగా..అధికారులు, స్థల యజమానులు మాత్రం ప్రైవేటుగా తామే చెక్‌డ్యాం నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడిస్తుండటం గమనార్హం.

మండలంలోని ఓ మహిళా రైతు 1.07 ఎకరాలను కొనుగోలు చేసి మ్యుటేషన్ చేయించుకోగా.. ఆన్‌లైన్‌లోనూ నమోదైంది. అయితే ఈ భూమి పక్కనే ఉన్న బడా బాబుల ఒత్తిడితో సదరు మహిళా రైతుకు డిజిటల్ సంతకం చేయలేదు. రెండున్నరేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోకపోవడంతో సదరు రైతు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఈ పరిణామంపై సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇటీవలే డిజిటల్ సంతకం చేశారు.

ఇదే మండలంలోని ఓ గ్రామంలో 14.10 ఎకరాల భూమిని నాలా భూమిగా మార్చారు. ప్లాట్లు చేసి అమ్ముడుపోకపోవడంతో దీనిని తిరిగి వ్యవసాయ భూమిగా మార్చేందుకు సదరు స్థిరాస్తి వ్యాపారులు నిర్ణయించగా..అధికారి ఈ 14.10 ఎకరాలకు పాసుపుస్తకాలను మంజూరు చేసినట్లు తెలిసింది.

నల్గొండ జిల్లాలో.. మారుమూల ప్రాంతంగా పేరొందిన నియోజకవర్గంలోని మండలమది. రాజధానికి దగ్గరగా ఉండటం, హైదరాబాద్ – నాగార్జునసాగర్ రహదారిపై మండల కేంద్రం ఉండటంతో అక్కడి భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడిదే అక్కడి అధికారికి వరమైంది. ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని విచ్చలవిడిగా ప్రతి పనికి ధర నిర్ణయించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులిస్తే భూమి లేని వారి పేరిట అయినా పాసుపుస్తకాలు వస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ భూములు హాంఫట్..!

మండలంలోని ప్రభుత్వ భూములను ఇక్కడి ప్రజాప్రతినిధి అధికారి సాయంతో చెరబట్టినట్లు తెలిసింది. సుమారు 32 ఎకరాలు ప్రభుత్వ, అసైన్డ్ భూములను సదరు ప్రజాప్రతినిధి బినామీలు, స్థానికంగా ఉండే మరో ప్రజాప్రతినిధి పేర్లతో నమోదైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ప్రభుత్వ భూముల విలువ రూ.కోట్లలోనే ఉంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మండలంలో ఎక్కడ ప్రభుత్వ, అసైన్డ్ భూములున్నాయో సదరు అధికారి ప్రజాప్రతినిధికి చెప్పడం, బినామీ పేర్లతో సదరు నేత దక్కించుకోవడం గత మూడు నాలుగేళ్లుగా నడుస్తోంది. మూడు, నాలుగు నెలల కింద ఇదే మండలంలోని విలువైన ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం నియోజకవర్గ నేత కుటుంబానికి చెందిన బినామీ పేర్లతో ధరణిలో నమోదు చేసినట్లు సమాచారం. రూ.కోట్ల విలువైన భూములను తన పరం చేయడంతో సదరు అధికారిని ఎక్కడికి బదిలీ చేయడానికి ఆ నేత ఒప్పుకోవడం లేదని తెలిసింది.సమగ్ర విచారణ చేసి తప్పుంటే చర్యలు తీసుకుంటాం

వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టరు, నల్గొండ

అనుమతులు లేకుండా వేస్తున్న వెంచర్‌లో చెక్‌డ్యాంలు ఉన్నాయనే దానిపై సమగ్ర విచారణ చేస్తాం. ఆ చెక్‌డ్యాంలు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయా? ప్రైవేటుగా నిర్మించుకున్నారనే దానిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం. ఈ వ్యవహారంలో ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులందరిపై చర్యలు తీసుకుంటాం.

# త్వరలో.. పురపాలికల్లో ఆధునిక ధోబీఘాట్లు

నల్గొండ : రజకుల కులవృత్తికి సాంకేతిక హంగులను మేళవించి ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రజకులకు ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్తు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేసింది. ఉచితంగా కరెంటు సరఫరా చేస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటికే స్మార్ట్ నగరాల్లో చేపట్టిన ఆధునిక ధోబీఘాట్ల సేవలు విజయవంతం కావడంతో.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణలో అన్ని పట్టణాలు, నగరాలు, పురపాలికల్లో ధోబీఘాట్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికలకు మంజూరు చేస్తూ ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. రూ.2 కోట్ల చొప్పున..నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల పరిధిలో 19 పురపాలికలు ఉన్నాయి. ప్రతి పట్టణంలో ఒక్కో ధోబీఘాటు నిర్మాణానికి టీయూఎఫ్ఐడీసీ పథకం ద్వారా రూ.రెండు కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఆయా పురపాలికల్లో యాంత్రీకరణతో కూడిన ధోబీఘాట్ల నిర్మాణాలకు స్థల సేకరణ పూర్తి చేసి ప్రజారోగ్యశాఖకు అప్పగించంతో అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు.

సత్వర సేవలు..ఆధునిక ధోబీఘాట్లలో పెద్దపెద్ద యంత్రాలు ఏర్పాటు చేయనుండటంతో ఒకేసారి 100 జతలకు పైగా దుస్తులు ఉతికే సామర్థ్యం ఉంటుంది. వాటిని ఇస్త్రీ చేయడం కూడా ఆధునిక పద్ధతే కావడంతో రజకులకు సమయం వృథా కాకుండా సత్వర సేవలను అందించే అవకాశం ఉంటుంది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ఆస్పత్రులు, వసతిగృహాలు ఎక్కువ సంఖ్యలో దుస్తులు, దుప్పట్లు ఉతికించేందుకు ధోబీఘాట్లను ఆశ్రయిస్తున్నారు. తద్వారా రజకులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడే అవకాశం ఉంది.

త్వరలో పనులు ప్రారంభంసత్యనారాయణ, ఈఈ, ప్రజారోగ్యశాఖ ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రారంభించాం. త్వరలోనే పనులు ప్రారంభించి ఈ ఏడాది చివరి నాటికి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.




మంగళగిరి: వ్యూహం చిత్రానికి ప్రతివ్యూహం ఉండకూడదంటే ఎలా అని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రశ్నించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మట్లాడారు. "ఎన్నికల ముందు ఈ తరహా సినిమాలు తీయడం ఓ ఫ్యాషన్ అయిపోయింది. ఇలాంటి సినిమాలకు జగనే డబ్బులు పంచుతున్నారు. దర్శకుడు ఆర్జీవీ తరఫున కోర్టుల్లో వాదనలు వినిపిస్తున్నదీ వైకాపా ఎంపీ నిరంజన్ రెడ్డే. ఈ న్యాయవాదులను చూస్తేనే ఆ సినిమా ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. న్యాయపరంగా తమకున్న హక్కుల కోసం పోరాడుతున్నాం. ఆర్జీవీ నిజంగా సినిమా తీయాలంటే హూకిల్డ్ బాబాయ్, కోడి కత్తి, ప్యాలెస్‌లో జరుగుతున్న అవినీతి మీద తీయొచ్చు" అని చెప్పారు.

**వారి పేర్లే రెడ్‌బుక్‌లో..** చట్టాన్ని ఉల్లంఘించిన అధికారుల పేర్లు మాత్రమే రెడ్‌బుక్‌లో రాస్తున్నామని లోకేశ్ తెలిపారు. తప్పు చేసిన వాళ్ల గురించి మాట్లాడితే తప్పేంటి? అని ప్రశ్నించారు. "అధికారులు తప్పు చేసినా మాట్లాడకూడదా? సీఐడీనే స్క్రిప్ట్ రాసివ్వమనండి.. అదే చదువుతా. లేదా సజ్జల వంటి వాళ్లు స్క్రిప్ట్ రాసిస్తే అదే చదువుతా. కొల్లి రఘురామిరెడ్డి, పీఎస్సార్ ఆంజనేయులు వంటి వాళ్లు తప్పు చేసినట్టు అంగీకరిస్తున్నారా? రెడ్‌బుక్‌లో ఎవరి పేర్లు ఉన్నాయో వాళ్లకెలా తెలుసు?" అని నిలదీశారు.

**ఓడిపోయే సీట్లనే బీసీలకు వైకాపా ఇస్తోంది..** వచ్చే ఎన్నికల్లో ఓడిపోయే సీట్లనే వైకాపా బీసీలకు ఇస్తోందని లోకేశ్ విమర్శించారు. వైకాపాలో తమకు గుర్తింపు లేదని వైకాపా బీసీ ఎమ్మెల్యే పార్థసారథి ఆవేదన చెందారన్నారు. "మంగళగిరిలో రెండు సార్లు రెడ్డిలకే టికెట్ ఇచ్చారు. ఇప్పుడు మంగళగిరిలో ఓడిపోతున్నామని తెలిసే బీసీకి ఇచ్చారు. కడప ఎంపీ స్థానం బీసీలకు ఇవ్వమనండి. పులివెందుల సీటు బీసీలకు ఎందుకివ్వరు?. చిలకలూరిపేటలో మంత్రి విడదల రజనీ చెత్త అని సీఎం జగన్ స్పష్టంగా చెప్పేశారు. చిలకలూరిపేటకు పనికి రాని విడదల రజనీ గుంటూరు వెస్ట్‌లో ఎలా పనికొస్తారు? ఓ నియోజకవర్గంలోని చెత్త .. మరో నియోజకవర్గంలో బంగారం అవుతుందా?" అని లోకేశ్ ఎద్దేవా చేశారు.




## సెన్సార్ బోర్డు సర్టిఫికెట్‌ను సస్పెండ్ చేసిన తెలంగాణ హైకోర్టు

### సినిమా విడుదల చేయరాదని ఆదేశం - తెదేపా పిటిషన్‌పై విచారణ 11కు వాయిదా

హైదరాబాద్: రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో రూపొందించిన 'వ్యూహం' సినిమా విడుదలకు తెలంగాణ హైకోర్టు బ్రేక్ వేసింది. ఈ సినిమాకు కేంద్ర సెన్సార్ బోర్డు జారీ చేసిన సర్టిఫికెట్‌ను జనవరి 11 వరకు సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సర్టిఫికెట్ ఆధారంగా చిత్రాన్ని విడుదల చేయరాదంటూ రామదూత క్రియేషన్స్, నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌లకు ఆదేశాలు జారీ చేసింది. పిటిషన్‌పై విచారణను జనవరి 11కు వాయిదా వేసింది. తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠను దెబ్బతీసేలా రూపొందించిన ఈ సినిమా ప్రదర్శనకు కేంద్ర సెన్సార్ బోర్డు అనుమతించడాన్ని సవాలు చేస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద గురువారం విచారణ చేపట్టారు. ఉదయం 11.45 నుంచి సాయంత్రం దాకా సుదీర్ఘ వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ నంద రాత్రి 11.30 తరువాత మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక ఆధారాల నేపథ్యంలో సినిమా ప్రదర్శనకు జారీ చేసిన సర్టిఫికెట్‌ను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధర్‌రావు, ఉన్నం శ్రవణ్‌కుమార్‌లు వాదనలు వినిపిస్తూ భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో కక్ష సాధింపుగా చిత్రాలు నిర్మించి విడుదల చేయడం సరికాదన్నారు. చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీయాలని నిర్మాత, దర్శకుడు బహిరంగంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గతంలో అయిదారు సినిమాలు తీసి.. వాటితో ఎలాంటి లాభం రాకపోయినా మళ్లీ తీస్తున్నారన్నారు. దీనికి ఒక నేత నుంచి ఆర్థిక సాయం అందుతున్నట్లుందని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఘనంగా చూపడం, చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా చేసుకున్నారన్నారు. సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో వైసీపీ మంత్రులు వేదికపై కూర్చున్నారని తెలిపారు. రాజకీయ వ్యంగ్య చిత్రాన్ని నిర్మించి సృజన పేరుతో తమ పరువు తీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందులో నేరుగా పేర్లు కూడా పెట్టారన్నారు. వ్యక్తి గౌరవ ప్రతిష్ఠలకు ప్రాధాన్యం ఉంటుందంటూ సుప్రీం కోర్టు వెలువరించిన పలు తీర్పులను న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు.

**నిర్మాత తరఫు వాదనలివి..** నిర్మాతల తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ కేవలం ట్రయలర్ చూసి కోర్టును ఆశ్రయించి సినిమాను నిలిపివేయాలని కోరడం సరికాదన్నారు. సెన్సార్ బోర్డు తరఫున అదనపు ఏజీ పి.నరసింహాశర్మ వాదనలు వినిపిస్తూ ఒకసారి బోర్డు సర్టిఫికెట్ జారీ చేశాక కోర్టులు జోక్యం చేసుకోరాదన్నారు.

ప్రాంతీయ సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించగా ఛైర్మన్ ద్వారా రివిజనల్ కమిటీకి సిఫారసు చేసినట్లు తెలిపారు. 10 మందితో కూడిన కమిటీ సినిమాను పరిశీలించి కొన్ని అంశాలను తొలగించాలని సూచించిందని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు ప్రస్తావనను, కొన్ని పేర్లను తొలగించాలని పేర్కొందన్నారు.

## ప్రజలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది

విజయవాడ: నగరంలోని పాత ప్రభుత్వాసుపత్రిలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా శుక్రవారం పర్యటించారు. ఓల్డ్ జీజీహెచ్‌లో రూ.25 కోట్లతో నిర్మించనున్న క్రిటికల్ కేర్ బ్లాక్, బీఎస్ఎల్-3 ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తగా 1.25 కోట్లతో నిర్మించిన ఐపీహెచ్ఎల్ ల్యాబ్స్‌ను కేంద్రమంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్సుఖ్ మాండవియా మాట్లాడుతూ, ఏపీలో వైద్య ఆరోగ్య శాఖ పనితీరు చాలా బాగుందని ప్రశంసించారు. ఆరోగ్య రంగంలో ఏపీకి పూర్తి స్థాయిలో సహకరిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతోనే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఏపీ ప్రభుత్వం హెల్త్ సెక్టార్‌పై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమన్నారు. సీఎం జగన్‌కి, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనికి కేందమంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. "ప్రజల ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. ప్రధాని మోదీ హెల్త్ సెక్టార్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా 1.70 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించాం. గత తొమ్మిదేళ్లలో 350 కి పైగా కొత్త మెడికల్ కళాశాలలనుప్రదాని మోదీ నిర్మించారు.




గ్రామీణ స్థాయిలో హెల్త్ వెల్ నెస్ సెంటర్లని జిల్లా ఆసుపత్రులు, ఎయిమ్స్ లాంటి సంస్థలతో అనుసంధానం చేశాం. గ్రామీణ ప్రాంతవాసులకు స్పెషలిస్ట్ సేవలు టెలీ కన్సల్టేషన్ ద్వారా ఉచితంగా అందిస్తున్నాం. ప్రతీ రోజూ 4 లక్షల వరకు టెలీ కన్సల్టేషన్ సేవలు అందిస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 5 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందిస్తున్నాం" అని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

## విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను విరమించండి



అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవంగా భాసిల్లుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను విరమించాలన్నారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. 3వ బ్లాస్ట్ ఫర్నేష్‌ను జిందాల్ కంపెనీకి అప్పగించటం తగదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను ఆదానీ కంపెనీకి అక్రమంగా అప్పగించేందుకు ఉక్కు మంత్రిత్వ శాఖ ఒత్తిడి తేవటం దుర్మార్గమని రామకృష్ణ అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగిస్తూ ఫ్యాక్టరీ పురోభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన క్యాప్టివ్ ఐరన్ ఓర్ గని కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

## ఏపీకి ప్రత్యేకహోదాపై కార్యాచరణ ప్రకటించిన జేడీ




విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదాపై జై భారత్ (ఎన్) పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ కార్యాచరణ ప్రకటించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వడం కేంద్రం బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్పెషల్ స్టేటస్ అధ్యాయం అయిపోయింది అంటున్నారు.. కాదు ఇప్పుడే మొదలైందని అన్నారు.

పార్లమెంట్‌లో ఏపీకి హోదా ఐదేళ్లు కావాలని అప్పటి ప్రభుత్వం చెబితే... కాదు పదేళ్లు కావాలని బీజేపి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలు అమలుచేయలేనప్పుడు ఇక పార్లమెంట్‌కు విలువేముంటుందని జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఎన్నికల కోసం మాత్రమే హోదా అంశాన్ని టీడీపీ, వైసీపీలు లేవనెత్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక హోదా సాధన కోసం బ్యాడ్జీలు ధరించి పోరాటం చేద్దామని పిలుపిచ్చారు.

పొలిటికల్ పార్టీ నేతలకు కూడా బ్యాడ్జీలు పెట్టాలన్నారు. ఈరోజు నుంచి తాను ఈ బ్యాడ్జీని తగిలిస్తానన్నారు. జనవరి 26న (రిపబ్లిక్ డే రోజు) ప్రత్యేక హోదా కోసం ప్రతిజ్ఞ చేద్దామని సూచించారు. ప్రతి ఛానల్ కూడా తమ లోగో పక్కన హోదా లోగోను కూడా పెట్టాలని కోరుతున్నానన్నారు. తమిళనాడులో జల్లికట్టు కోసం ఉద్యమం చేసి సాధించారని.. అలాగే ప్రత్యేక హోదా కోసం రాజకీయ పార్టీలు కాకుండా ప్రజలు ఉద్యమిస్తేనే హోదా వస్తుందని జేడీ లక్ష్మీనారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## స్మార్ట్ సిటీ నిధులు డైవర్ట్ చేసే ప్రయత్నం జరుగుతోంది



కాకినాడ: కేంద్రం రాష్ట్రానికి సహకారం అందించడం లేదని అపవాదు వేస్తున్నారని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్కొన్నారు. కేంద్రం భాగ్యస్వామ్యం లేకుండా రాష్ట్రంలో ఏ అభివృద్ధి జరగడం లేదన్నారు. కార్యకర్తలను కలవాలని ఈ పర్యటనలు చేస్తున్నానన్నారు. జిల్లాల్లో రాజకీయ పరిస్థితులు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను నిర్వహిర్తించడం లేదని పురందేశ్వరి అన్నారు. స్మార్ట్ సిటీ నిధులు డైవర్ట్ చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కాకినాడలో పెట్రో కెమికల్ కారిడర్ పెడతామని కేంద్రం ముందుకు వస్తే రాష్ట్రం ముందుకు రాలేదని పురందేశ్వరి తెలిపారు.

## జగన్ ఆర్థిక ఉగ్రవాది.. ల్యాండ్, శాండ్ దోచుకున్నారు..

శ్రీకాకుళం: జగన్ ఆర్థిక ఉగ్రవాది అని ఎంపీ రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మాయమాటలు చెప్పి జగన్ అధికారంలోకి వచ్చాడన్నారు. 99.5 శాతం హామీలు పూర్తి చేశామని వైసీపీ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. మీడియా సమావేశం పెట్టడానికి సీఎం భయపడుతున్నాడన్నారు. ప్రత్యేక హోదాపై కనీసం ఒక్క ప్రయత్నం చేయలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటికరణ చేస్తున్నా ఆపే ప్రయత్నం చేయలేదన్నారు. ల్యాండు శాండు దోచుకున్నారని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

విశాఖపట్నం రాజధానిపేరుతో ఉత్తరాంధ్ర ప్రజలని మోసం చేశారని రామ్మోహన్ నాయుడు అన్నారు. దోచుకోవడం దాచుకోవడమే వైసీపీ పాలసీ అని పేర్కొన్నారు. మద్యపానం నిషేధంపై మాట తప్పారన్నారు. మద్యంపై అప్పులు తెచ్చుకున్న అప్పుల మహారాజు జగన్ అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజలపై



ధరల భారం మోపాడన్నారు. జగన్ మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నాడన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లు హామీలు నెరవేర్చలేదన్నారు. అడుదాం ఆంధ్రా అంటూ డబ్బులు దండుకుంటున్నాడని.. ప్రజలు మేల్కోవాలని రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.

## అంగన్వాడీల జీతాలపై మేం అలా చెప్పలేదు: మంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరం: అంగన్వాడీలకు తెలంగాణ ప్రభుత్వం జీతాలు పెంచిన ప్రతిసారీ తామూ పెంచుతామని చెప్పలేదని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1000 పెంచుతామని హామీ ఇచ్చామని.. ఆ మేరకు మొదటి ఏడాది రూ.11వేలు చేసినట్లు చెప్పారు. ఇప్పుడు కూడా అంగన్వాడీల పది డిమాండ్లు అంగీకరించామని.. అయితే, ఎన్నికలకు వెళ్తున్నామని.. సమయం లేని కారణంగా అర్థం చేసుకోవాలని కోరినట్లు చెప్పారు. విజయనగరంలో మంత్రి మాట్లాడారు. వైకాపా హామీల అమలుపై తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల మార్పులు, చేర్పులు సహజమన్నారు. స్థానిక పరిణామాలు, పరిస్థితులు, సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని ఏ రాజకీయ పార్టీ అయినా మార్పులు చేయడం సహజంగా జరిగేదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా షర్మిల వచ్చినా వైకాపాకు ఎలాంటి నష్టం లేదన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై చర్చలు జరుగుతున్నాయని.. రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేల పనితీరు బాగుందని మార్పు ఉండబోదనే నమ్మకాన్ని బొత్స వ్యక్తం చేశారు.

## జనవరి 4 నుంచి తెదేపా 'జయహో బీసీ'.. ప్రకటించిన నారా లోకేశ్

మంగళగిరి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బీసీల ద్రోహి అని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. వైకాపా పాలనలో బీసీలకు జరిగిన అన్యాయంపై వారిలో చైతన్యం కల్పించేందుకు జనవరి 4 నుంచి 'జయహో బీసీ' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమ వివరాలను తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో లోకేశ్ వెల్లడించారు. ఈ కార్యక్రమం 2 నెలల పాటు కొనసాగుతుందని.. తొలి విడతలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల్లో తెదేపా నేతలు పర్యటిస్తారన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలోనే బీసీల కష్టాలు తెలుసుకుంటామన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి బీసీల కోసం ప్రత్యేక మేనిఫెస్టోను తెదేపా అధినేత చంద్రబాబు విడుదల చేస్తారని వివరించారు. "వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీ సోదరులను ఇబ్బంది పెట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్ తగ్గించింది. 16 వేల మంది బీసీలకు అవకాశాలు లేకుండా చేసింది. 8 వేల ఎకరాల బీసీల అసైన్డ్ భూములను కూడా వెనక్కి తీసుకుంది. ఆదరణ పథకాన్ని రద్దు చేసింది. ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందలేదని నా పాదయాత్రలో చెప్పారు. 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు.. నిధులు.. విధుల్లేవు. జీవో 217 తీసుకొచ్చి మత్స్యకారుల వెన్నెముక విరగ్గొట్టింది. పట్టు రైతులకు కనీసం సబ్సిడీ ఇచ్చే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదు. బీసీ సోదరుల తరఫున పోరాడుతున్న తెదేపా బీసీ నేతలపై కేసు పెట్టి



వేధించారు. యనమల రామకృష్ణుడు, అయ్యన్న పాత్రుడు, కొల్లు రవీంద్ర, అచ్చెనాయుడుపై అక్రమ కేసులు పెట్టారు. ప్రొద్దుటూరులో తెదేపా నాయకుడు నందం సుబ్బయ్యను చంపేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే దుకాణం ధ్వంసం చేశారని శ్రీకాళహస్తిలో ముని రాజమ్మ చెప్పింది. బీసీలు బలహీనులు కాదు.. బలవంతులన్నదే తెలుగుదేశం నినాదం. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు సముచిత స్థానం కల్పించింది తెలుగుదేశమే. బీసీలకు రక్షణ చట్టం పేరిట మినీ మేనిఫెస్టోలో ఇప్పటికే ప్రాధాన్యమిచ్చాం.

తెదేపా అధికారంలో వచ్చాక బీసీలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం. బీసీ ఉపకులాలకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి వారికే ఖర్చు చేస్తాం" అని లోకేశ్ హామీ ఇచ్చారు.

# రెడ్ అలెర్ట్: జాన్వీ జంతర్ మంతర్

శ్రీదేవి నటవారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్ లో రఫ్ కాంపిటీటర్ అనడంలో సందేహం లేదు. నటిగా లేదా ఫ్యాషనిష్టాగా ఈ భామకు సాటిలేరు ఎవరూ. సారా అలీఖాన్, అనన్య పాండే లాంటి నటవారసురాళ్లు బరిలో ఉన్నా కానీ జాన్వీ కపూర్ స్పీడ్ ముందు వీళ్లెవరూ కనిపించడం లేదనే చెప్పాలి. ముఖ్యంగా బోల్డ్ అండ్ డస్కీ ఫోటోషూట్లతో ఇంటర్నెట్ ని షేక్ చేయడంలో జాన్వీ ఎప్పుడూ ముందుంటోంది. ఈ భామ స్టన్నింగ్ ఫోటోషూట్లు ఎప్పటికప్పుడు నెట్‌లో అగ్గి రాజేస్తూనే ఉన్నాయి. అలాంటి మరో ఫోటోషూట్ ఇప్పుడు అంతర్జాలంలో హాట్ టాపిక్ గా మారింది. జాన్వీ కపూర్ రెడ్ హాట్ లుక్ కి సంబంధించిన చర్చ వేడెక్కిస్తోంది. తాజాగా ఎరుపు రంగు లెదర్ డ్రెస్‌లో జాన్వీ హొయలు చెమటలు పట్టిస్తున్నాయంటే



అతిశయోక్తి కాదు. ఈ ఫోటోగ్రాఫ్స్ లో జాన్వీ తడిపొడి తమకం యూత్ ని కవ్విస్తోంది. వెట్టీ హెయిర్ .. స్మోకీ ఐస్..మెరిసే అందంతో జాన్వీ గురుత్వాకర్షణకే సవాల్ గా మారింది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న జాన్వీ తదుపరి టాలీవుడ్ అగ్ర హీరోలందరి సరసనా నటించేందుకు ఆసక్తిగా ఉందని కథనాలొస్తున్నాయి. రామ్ చరణ్ కథానాయకుడిగా 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సీక్వెల్ ని తెరకెక్కిస్తే బహుశా జాన్వీకి అవకాశం ఉంటుంది. తదుపరి బన్ని, మహేష్, ప్రభాస్ లాంటి అగ్ర హీరోల సరసనా నటించేందుకు జాన్వీ ఆసక్తిగా ఉంది. మరోవైపు కోలీవుడ్ లోను సరైన అవకాశం వరిస్తే నటించేందుకు సిద్ధమేనని జాన్వీ సన్నిహిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ రెండు పరిశ్రమలతో పాటు, బాలీవుడ్ ని ఈ బ్యూటీ బ్యాలెన్స్ చేసేందుకు ప్రణాళికల్ని రచిస్తోంది.

# రాణీ ముఖర్జీకి సవాల్ విసిరిన రోల్ అది!

బాలీవుడ్ నటి రాణీముఖర్జీ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ సీనియర్ నటి దూసుకుపోతుంది. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంది. ఎక్కువగా లేడీ ఓరియేంటెడ్ కథల్లోనూ కనిపిస్తుంది. అప్పుడప్పుడు ఆమె అనుభవం..తాజా పరిస్థితుల్ని ఉద్దేశించి హీరోయిన్లకు కొన్ని విలువైన సలహాలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె కెరీర్ భారీ విజయం సాధించిన 'బ్లాక్' చిత్రం గురించి గుర్తు చేసుకుంది. ఈ సినిమా అమ్మడి కెరీర్ లో ఓ మైలు రాయిగా నిలిచిపోయింది. అందులో నటనకు గాను విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లో ఆ నాటి సంగతులు ఇలా గుర్తు చేసుకుంది. బ్లాక్ లో అమితాబ్ సర్ తో తెరను పంచుకోవడం నా అదృష్టం. ఆ సినిమా నన్ను ఓ మంచి



నటిగానే కాదు ఒక ధృడమైన వ్యక్తిగా మలిచింది. షూటింగ్ సమయం లో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. వినికిడి లోపం..మాట్లాడటం రాని అమ్మాయి పాత్రలో నటించిడానికి నాలో ప్రేరణ కల్పించింది ప్రఖ్యాత రచయిత్రి హెలెన్ కెల్లర్. ఆపాత్ర నన్ను నాకే కొత్తగా పరిచయం చేసింది. మాటలు రాని వారు అదే పనిగా సంజ్ఞలు ద్వారా మనసులో ఉన్నది తరులతో తెలియజేయడం ఎంత కష్టమో అప్పుడు తెలిసింది. మహిళలను శక్తువంతులుగా..ధైర్యవంతులుగా చూడటం అంటే నాకు ఎంతో ఇష్టం. అందుకే నేను కొన్ని అలాంటి సినిమాలు కూడా చేసాను. వాళ్లలో ఆలోచనల్ని ప్రేరేపించేలా స్ఫూర్తి రగిలించేలా చేయడం ముఖ్యం. సినిమా మాధ్యమంతో నా ఫరిదిలో కొంత వరకైనా అలా చేయగలగాలి. కనీసం ఆ రకమైన మార్పు అయినా తీసుకురాగలిగితే ఎంతో సంతోషిస్తాను. ఎప్పుడూ ఒకేలా ఉండటం కంటే లైఫ్ ని భిన్నమైన కోణాల్లో చూడగల్గాలి. అప్పుడే జీవితం అంటే ఏంటో అర్దమవుతుంది అని అంది.




# సవారి దర్శకుడి 'పొట్టేల్'.. డిఫరెంట్ మోషన్ పోస్టర్!



ఈ మధ్యకాలంలో గ్రామీణ నేపథ్యంలో వస్తున్న సినిమాలు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటున్నాయి. మంచి కంటెంట్ తో పాటు ఎమోషన్స్ ఉంటే బాక్సాఫీస్ వద్ద ఆ సినిమాలకు కలెక్షన్ల వర్షం కురుస్తుంది. ఇప్పటికే మల్లేశం, బలగం లాంటి సినిమాలు దాన్ని నిరూపించింది. అలాంటి కోవలోనే ఇప్పుడు మరో సినిమా రాబోతోంది. ఆ సినిమా పేరే 'పొట్టేల్'. సవారి సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న సాహిత్ మోత్కూరి ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ళ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. తాజాగా టైటిల్ మోషన్ పోస్టర్ ని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మోషన్ పోస్టర్ సినిమాపై ఒక్కసారిగా ఆసక్తిని పెంచేసింది. టైటిల్ కి తగ్గట్టే ఈ మోషన్ పోస్టర్ ఉంది. అంతేకాకుండా బోనాల పండుగను గుర్తు చేసే విధంగా ఈ మోషన్ పోస్టర్ని డిజైన్ చేశారు. అమ్మవారి ముందు పొట్టేలు సాంప్రదాయకంగా అలరించి బలిచ్చే ముందు భోగినీలు పాడే లయబద్ధమైన పాటతో గూజ్ బంప్స్ వచ్చేలా ఉన్న మోషన్ టీజర్ ఆధ్యంతం ఆకట్టుకుంది. తెలంగాణ ప్రాంతంలోని ఆచారాలు ఈ సినిమా చూపించబోతున్నాను. తాజాగా విడుదల చేసిన మోషన్ టీజర్ లో శేఖర్ చంద్ర మ్యూజిక్ మెయిన్ హైలెట్ అనే చెప్పాలి. ఎన్ ఐ ఏ ఎంటర్టైన్మెంట్స్ నిశాంత్ రెడ్డి, కుడికి ప్రగ్యా సన్నిధి క్రియేషన్స్ సురేష్ కుమార్ సడిగే సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అజయ్, తన శ్రీ, ప్రియాంక శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, చత్రపతి శేఖర్, జీవన్, విక్రమ్, రియాజ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టిన ఈ చిత్రానికి మల్లేష్ భూపతిరాజు సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు.నార్ని శ్రీనివాస్ ఆర్ట్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. ఇక పొట్టేల్ సినిమా డైరెక్టర్ సాహిత్ మోత్కూరి విషయానికొస్తే.. 'బంధం' అనే ఇండిపెండెన్స్ సినిమాతో దర్శకుడుగా మారిన ఇతను నందుతో 'సవారి' అనే సినిమాని తెరకెక్కించాడు. కమర్షియల్ గా ఈ సినిమా సక్సెస్ కాకపోయినా మంచి కంటెంట్ తో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఒక సవారి తర్వాత మరో డిఫరెంట్ కాన్సెప్ట్ తో 'పొట్టేల్' సినిమాని తెరకెక్కించారు. మోషన్ పోస్టర్ ని బట్టి ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంటుందని అర్థమవుతుంది. సినిమాకు సంబంధించిన మిగతా వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు మేకర్స్.

# బుట్టబొమ్మని మించిన సింగారం మృణాల్ సొంతం!




బుట్టబొమ్మ పూజాహెగ్డే బ్యూటీ గురించి ఎంతగా పొగిడేస్తామో తెలిసిందే. బుట్టబొమ్మ డిజైన్ తో కూడిన గౌను పూజ ధరించడంతోనే! అంతటి బ్యూటీ సొంతమైంది. ఎన్నో డిజైన్స్ లో హీరోయిన్స్ కనిపిస్తుంటారు. కానీ కొన్ని ప్రత్యేకమైన డిజైన్లు మాత్రం ఎవ్వెర్ గ్రీన్ గా కనెక్ట్ అవుతుంటాయి. అలాంటి వాటి గురించి ఎక్కువగా చర్చించుకుంటాం. తాజాగా బుట్టబొమ్మని మించిన బ్యూటీని మృణాల్ తలపిస్తుంది. అవును ఇక్కడ అమ్మడు ముస్తాబైన విధానం చూస్తే బుట్టబొమ్మ ఏ కోసానా సరిపోదు అనిపిస్తుంది. లెహంగా ని పోలిని గౌనులో మృణాల్ ఓ అద్భుతం అనడంలో అతిశయెక్తి లేదు. గ్రీన కలర్ బ్యాక్ లెస్ డిజైన్...నడుం దగ్గర నుంచి కాలా పాదాల వరకూ ఉన్న మల్టీ డిజైన్ మరింత ఆకర్షణీయంగా ఉంది. అమ్మడి ఎత్తును మ్యాచ్ చేస్తూ డిజైన్ చేసిన ఈ దుస్తుల్లో మృణాల్ ఎంతో అందంగా కనిపిస్తుంది. ఇక చేతుల్లో హై హీల్స్ ని హైలైట్ చేస్తుంది. డ్రెస్ మ్యాచింగ్ చెప్పులు ధరించాలి. కానీ ఈ డిజైన్ పై హై హీల్స్ ధరిస్తే అవెక్కడా కనిపించవు. అందుకే ఇలా వాటిని ఇలా స్టైలిస్ట్ ఇలా చేతుల్లో ఉంచి కెమెరాకి అనువైన భంగిమని సెలక్ట్ చేసుకున్నాడు. మరి ఇదంతా ఎందుకోసం అంటే? వెడ్డింగ్స్ హనీమూన్ కవర్ పేజీ కోసం మృణాల్ ఇలా ముస్తాబైంది. ముంబై నోవెటాల్ లో ఈ ఫోటో సెషన్ జరిగింది. 2023-24 మంత్లీ కవర్ పేజీ కోసం ఇలా మృణాల్ మతి చెడే బ్యూటీతో ప్రేక్షకుల్ని పలకరించనుంది. ప్రస్తుతం సెలబ్రిటీల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ ఎక్కువవుతోన్న సంగతి తెలిసిందే. కుటుంబ సభ్యుల సమక్షంలో అందమైన ప్రదేశాల్లో నిరాండంబరంగా పెళ్లి చేసుకోవడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో మ్యాగజైన్ లో ఆ రకమైన అంశాల్ని హైలైట్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటో అంతార్జాలంలో వైరల్ గా మారింది. మృణాల్ అలంకరణకు అంతా ఫిదా అవుతున్నారు.

# మంచులక్ష్మి.. మరోసారి మైండ్ బ్లాక్ లుక్

డైలాగ్ కింగ్ మంచు మోహన్ బాబు వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది మంచు లక్ష్మి. ఒకప్పుడు నటిగా మెప్పించింది. నిర్మాతగా సినిమాలు చేసింది. బుల్లితెరపై యాంకర్ గా ఆకట్టుకుంది. పేదలకు సహాయం చేయడంలో కృషి చేసింది. ఇప్పుడు వ్యాపారాలు, సినిమాలపై ఫోకస్ పెట్టింది. అదే సమయంలో ఫిట్ నెస్ కు ఎక్కువ ప్రియారిటీ ఇస్తోంది. ఇటీవల ఆమె ఫిట్‌నెస్ చూస్తే వాహ్ అనిపిస్తుంది. ఆమె గ్లామర్ ఫొటోలు, మెరుపులు చూస్తే మతిపోవాల్సిందే. హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తుందా అనేలా రెడీ అవుతుంది. నాలుగు పదుల వయసులోనూ అందంగా రెడీ అయి గ్లామర్ ఫోటో షూట్లు చేస్తుంది. కుర్రాళ్ల మతిపోగొడుతుంది. తాజాగా రెడ్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో మెరిసింది. కొంటె చూపుతో అట్రాక్ట్ చేస్తోంది. ఓ కారులో దిగిన ఫొటోను షేర్ చేసింది. ప్రస్తుతం ఆమె పిక్ ఫుల్ వైరల్ గా మారింది. మంచు లక్ష్మి గ్లామర్ కు నెటిజన్లు



పాజిటీవ్ గా రియాక్ట్ అవుతున్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే మంచు లక్ష్మి.. తనకు సంబంధించిన అప్డేట్స్ అందిస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు తన సినిమా, ఫ్యామిలీ అప్డేట్స్ షేర్ చేయడంతో పాటు సమాజంలో జరుగుతున్న పలు అంశాలపై రియాక్ట్ అవుతూ ఉంటుంది. అయితే చాలా మంది మంచు లక్ష్మి మాట్లాడే మాటలు, మాట్లాడే విధానాన్ని ట్రోల్ చేస్తూ ఉంటారు. కానీ, ఆమె సమాజానికి చాలా మేలు చేసే పనులు చేస్తూ ఉంటుంది. స్కూళ్ల ను దత్తత తీసుకోవడం, ఆ స్కూళ్లలోని పిల్లలకు మంచి విద్య, అని వసతులు అందించేలా ఆమె కృషి చేస్తూ ఉంటుంది.

ఈ విషయాల గురించి మాత్రం తక్కువగా మాట్లాడుతూ ఉంటారు. గతేడాది మోహన్ లాల్ నటించిన మాన్ స్టర్ మూవీతో ప్రేక్షకులను మంచు లక్ష్మి అలరిం చింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనిపించింది. ప్రస్తుతం అగ్ని పర్వతం అనే లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో నటిస్తుంది. ఇక ఈ సినిమా నిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్ కు మంచి రెస్పాన్స్ దక్కింది.

## గుట్టంతా రట్టు చేస్తానని జాకీకి బెదిరింపులు

బాలీవుడ్ అందాల కథానాయిక జాక్విలిన్ ఫెర్నాండెజ్ – మోసగాడు సుకేష్ చంద్రశేఖర్ నడుమ ప్రేమాయణం కీలక మలుపు తిరిగింది. జాక్విలిన్ పై తన ప్రేమను దాచుకోకుండా జైలు నుంచే ప్రేమలేఖలు రాస్తున్నాడు సుకేష్. అయితే ఇవన్నీ తనకు థ్రెట్ గా మారాయంటూ జాక్విలిన్ కోర్టుకెక్కడంతో ఈ ప్రేమకథలో సరికొత్త ట్విస్టు బయటపడింది. ఎవరో రక్షించడానికి ప్రయత్నించి తన వెన్నులో పొడిచి చంపినందుకు బాధపడ్డానని సుకేష్ చంద్రశేఖర్ తన లేఖలో ఆవేదన వెల్లగక్కాడు. సుఖేష్ చంద్రశేఖర్‌పై మోసం కేసును దర్యాప్తు చేస్తున్న ED విచారణలో పట్టుబడ్డ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఇప్పుడు సుకేష్ కి వ్యతిరేకంగా కోర్టునాశ్రయించడంతో అతడి నుండి లేఖ రూపంలో బెదిరింపులు ఎదురయ్యాయి. ఎవరో రక్షించడానికి ప్రయత్నించి తన వెన్నులో పొడిచి చంపినందుకు బాధపడ్డానని సుకేష్ చంద్రశేఖర్ తన లేఖలో వెల్లడించాడు. ఇటీవల శిక్ష అనుభవిస్తున్న కాన్‌మ్యాన్ జాకీకి అనేక ప్రేమ లేఖలు రాస్తున్నాడు. చాలా సందర్భాలలో తనపై అంతులేని ప్రేమను వ్యక్తపరిచాడు. కానీ ఇంత లోనే జాక్విలిన్ తన లాయర్ తో అతడికి నోటీసులు పంపారు. తనకు లేఖలు పంపకుండా నిరోధించాలని ఇటీవల అధికారులను ఆశ్రయిం చింది. దీనిపై ఇప్పుడు సుకేష్ స్పందిస్తూ బెదిరింపు లేఖ పంపినట్లు సమాచారం. ఈ లేఖలో సుకేష్ చంద్రశేఖర్ జాకీతో తన సంభాషణలను



బహిర్గతం చేస్తానని బెదిరించాడు. జాక్విలిన్ పై తనకు ఉన్న శ్రద్ధ కారణంగా ఆ పని చేయడం మానేశానని తెలిపాడు. "నా క్రూరమైన కలలో కూడా నేను దీనిని ఊహించలేదు.. కానీ గుండె ఎప్పుడూ పగిలిపోయేలా లేదా విరిగిపోయేలా తయారు చేసినదని నేను భావిస్తు న్నాను" అని సుకేష్ ఆవేదన చెందాడు. మీరు చేసే ప్రతి పనిలో రక్షించడం, ఒకరిని రక్షించడం నాకు తెలుసు. పరుల మాటలతో నాపై నీవు నిందలు వేయడం ప్రారంభించినప్పుడు షాక్ అయ్యాను. ఇలా చూడు .. "డెవిల్, ది బ్యాడ్ గై" అని లేఖలో రాసాడు. కాబట్టి, పగిలిన హృదయంతో నేను గాయపడకూడదని, తిమ్మిరిగా లేదా నిశ్శబ్దంగా ఉండకూడదని నిర్ణయించుకున్నాను. నిజం చాలా శక్తివంత మైనదని తెలుసుకోవాలి. ఇప్పుడు ప్రపంచం నిజం, వాస్తవికతను తెలుసుకోవలసిన సమయం వచ్చింది. ఇప్పుడు నేను దేనినైనా బహిర్గతం చేయడానికి ముందుకు వెళ్తాను.. చట్టం ప్రకారం" అని హెచ్చరించాడు. ఆమె(జాకీ) కోస్టార్(సహోద్యోగి)తో పోటీ పడటానికి, అలాగే సోషల్ ప్లాట్‌ఫారమ్ మెరుగుదల కోసం చెల్లించిన కొన్ని మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన చెల్లింపులకు సంబంధించిన ప్రతి చిన్న వాస్తవం కూడా భారతీయ కరెన్సీ ప్రకారం నేను చెల్లించిన అన్ని సంబంధిత ఇన్‌వాయిస్ లను బయటపెడతాను. సాక్ష్యాధారాలతో చట్టం ముందుకు తెస్తాను! అని సుకేష్ లేఖను ఘాటుగా ముగించారు.




# మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన మంత్రుల బృందం

మేడిగడ్డ: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని ఐదుగురు మంత్రుల బృందం పరిశీలించింది. శుక్రవారం మధ్యాహ్నం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొమటిరెడ్డి బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. విహంగ వీక్షణం ద్వారా ఆనకట్టను పరిశీలించారు. మంత్రులతోపాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ కూడా ఉన్నారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రులకు నీటిపారుదల శాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

**ప్రారంభించినప్పటి నుంచే ఎన్నో అనుమానాలు : ఉత్తమ్** – అంతకుముందు మంత్రి ఉత్తమ్ ప్రసంగిస్తూ మేడిగడ్డ కుంగడం బాధాకరమని పేర్కొన్నారు. " కాళేశ్వరం ప్రారంభించినప్పటి నుంచి అనుమానాలు ఉన్నాయి. మేడిగడ్డ కుంగినప్పటి నుంచి ఇప్పటి వరకూ కేసీఆర్ స్పందించలేదు. దీనిపై న్యాయ విచారణ జరుపుతామని శాసన సభలోనే ప్రకటించాం. కాళేశ్వరం కంటే ప్రాణహితే ఉత్తమమైనది. మహారాష్ట్రలో కొంత ముంపుతో ప్రాణహిత పూర్తి అయ్యేది. ప్రాజెక్టు వ్యయాన్ని రూ.80 వేల కోట్ల నుంచి లక్షన్నర కోట్లకు పెంచారు. మేడిగడ్డ కుంగడమే కాదు.. అన్నారం బ్యారేజీ కూడా డ్యామేజీ అయ్యింది. ఇంకా సుందిళ్లను పరిశీలించాల్సి ఉంది" అని ఉత్తమ్ అన్నారు.

# తెలంగాణలో పెరిగిన నేరాలు...

## వార్షిక నివేదికను విడుదల చేసిన డీజీపీ రవి గుప్తా



హైదరాబాద్: తెలంగాణా డీజీపీ రవి గుప్తా శుక్రవారం ఉదయం వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని, పోలీసులు, మీడియా సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు పూర్తి చేశామన్నారు. గత ఏడాదితో పోలిస్తే 8.97 శాతం రాష్ట్ర వ్యాప్తంగా క్రైమ్ రేట్ పెరిగిందని, ఈ ఏడాది 2,13,121 కేసులు నమోదు చేశామన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సైబర్ క్రైమ్ నేరాలు 17. 59 శాతం పెరిగాయన్నారు. ఈ ఏడాది జీరో ఎఫ్ఐఆర్‌లు 1108 నమోదు చేశామని, ఐపీసీ సెక్షన్ కింద 1,38,312 కేసులు నమోదు చేసినట్లు డీజీపీ రవి గుప్తా వెల్లడించారు. 73 రేప్ కేసుల్లో 84 మందికి జీవిత ఖైదీ శిక్షలు పడ్డాయని, ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 1,360 డ్రగ్ కేసులు ఎన్డీపీఎస్ కింద నమోదు చేశామని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 15.6 శాతం డ్రగ్స్ కేసులు పెరిగాయన్నారు. 2,52,60 కేజీల గంజాయి, 1240 గంజాయి మొక్కలను సీజ్ చేసి.. 2583 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కేసులు 1877 నమోదు చేశామని, డ్రగ్స్‌పై తెలంగాణ పోలీస్ కఠినంగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వ ఆదేశాలతో డ్రగ్స్ పటిష్ట నిఘా కొనసాగుతోందని డీజీపీ స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణకు యాంటి నార్కోటిక్ బ్యూరో ఏర్పాటు చేశామని, 59 డ్రగ్స్ కేసుల్లో 182 మందిని అరెస్ట్ చేశామని డీజీపీ రవిగుప్తా తెలిపారు. 175 మంది రిపీటెడ్ డ్రగ్ ఫెడ్లర్స్‌పై పిడి యాక్ట్ నమోదు చేశామని, 12 మంది ఫారెన్ అఫెండర్స్‌ను అరెస్ట్ చేశామని, 536 మంది డ్రగ్స్ కంజూమర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చామని డీజీపీ తెలిపారు.

# తెలంగాణ: కరోనా కేసులపై దొంగ లెక్కలు?



హైదరాబాద్ : దేశంలో చాప కింద నీరులా కరోనా వైరస్ విస్తరిస్తోంది. తెలంగాణ విషయానికొస్తే.. మొన్నటిదాకా రాజధాని హైదరాబాద్‌లోనే అత్యధిక కేసులు నమోదు అవుతున్నాయని అనుకున్నారంతా. ఇప్పుడది పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చేరింది. భూపాలపల్లి, కరీంనగర్, తాజాగా మంచిర్యాలలో కోవిడ్ కేసులు వెలుగు చూశాయి. కానీ, అధికారిక లెక్కల్లో మాత్రం వాటిని చూపడం లేదు!. కరోనా వైరస్‌లో జేఎన్.1 వేరియెంట్.. వ్యాప్తి శరవేగంగా ఉంటోంది. చలికాలం.. ఫ్లూ సీజన్ కావడంతో అప్రమత్తంగా ఉండాలని కేంద్రం మొదటి నుంచి హెచ్చరిస్తూ వస్తోంది. అయితే ప్రజలను అప్రమత్తం చేయడంలో మాత్రమే కాదు.. ఆఖరికి కరోనా బులిటెన్‌ను విడుదల చేయడంలోనూ ఆరోగ్య శాఖ పూర్తి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. గత రెండు రోజులుగా కరోనా లెక్కలపై ఆరోగ్య శాఖ అధికారిక ప్రకటనేం చేయడం లేదు. అధికారుల్ని అడిగితే.. ప్రభుత్వమే ఇకపై గణాంకాలు విడుదల చేస్తుందంటూ ఓ ప్రకటన ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మరోవైపు ప్రభుత్వం సైతం కరోనా లెక్కలపై ఎటూ తేల్చడం లేదు. రెండ్రోజుల కొకసారి విడుదల చేస్తారని చెప్పినా.. అందులోనూ స్పష్టత లేదు.

**మరీ ఇంత తక్కువా? :** రెండు రోజుల కిందట బులిటెన్‌ను పరిశీలిస్తే.. 1,333 టెస్టులు చేయగా అందులో ఎనిమిది మందికి మాత్రమే కరోనా పాజిటివ్ గా తేలిందట. మొత్తంగా.. ఆ రోజునాటికి యాక్టివ్ కేసుల సంఖ్యను 63గా పేర్కొంటూ.. రెండు కరోనా మరణాలు సంభవించాయని ప్రకటించి ఆపేశారు. అయితే.. జిల్లా వైద్యాధికారులేమో అధికారిక లెక్కల విషయంలో పొంతనే లేదంటున్నారు. వింటర్ సీజన్.. బస్సుల్లో రద్దీ, మెట్రోలో రద్దీ, పైగా పెళ్లిళ్లతో పాటు పండుగ సీజన్ కావడంతో ఎక్కువగా జనం చేరుతుండటం వల్ల కూడా కేసుల సంఖ్య పెరిగే ఉంటుందని వాళ్లు అంచనా వేస్తున్నారు. వ్యక్తిగతంగా టెస్టులు చేయించుకుంటున్నవాళ్లు.. పాజిటివ్‌గా నిర్ధారణ అవుతున్నవాళ్ల లెక్కను అందులో కావాలనే చేర్చడం లేదనే విమర్శా బలంగా వినిపిస్తోంది. మరోవైపు.. వైరస్ విజృంభించే అవకాశాలున్న సమయంలో రాష్ట్రంలో కొవిడ్ కేసులపై దాపరిక ధోరణి సరికాదంటున్నారు వైద్యనిపుణులు. కొత్తగా నియమించబడ్డ తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్ దీనిపై ఏదైనా ప్రకటన చేస్తారేమో చూడాలి.

# రూ.400 కోట్లతో 1,050 కొత్త బస్సులు: టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్



హైదరాబాద్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (%ూ=ఞ%) చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. రూ.400 కోట్లతో అధునాతనమైన 1,050 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సంస్థ కొనుగోలు చేయాలనుకొనే వాటిలో 400 ఎక్స్‌ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరీ స్లీపర్ కమ్ సీటర్, 56 ఏసీ రాజధాని బస్సులు ఉన్నాయని వివరించారు. వీటికి తోడు హైదరాబాద్ నగరంలో 540, తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో 500 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విడతల వారీగా 2024 మార్చి నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళిక రూపొందించినట్లు సజ్జనార్ వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం స్కీమ్‌లో భాగంగా రద్దీ పెరగడంతో కొత్త బస్సులను వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. "అత్యాధునిక హంగులతో కూడిన 80 కొత్త బస్సులు శనివారం నుంచి వినియోగంలోకి వస్తాయి. వాటిలో 30 ఎక్స్‌ప్రెస్, 30 రాజధాని ఏసీ, 20 లహరీ స్లీపర్ కమ్ సీటర్(నాన్ ఏసీ) బస్సులు ఉన్నాయి. ఈ కొత్త బస్సులను హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తాం. తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై కొత్త బస్సులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు" అని సజ్జనార్ తెలిపారు.

# కాంగ్రెస్, సీపీఐ మధ్య తగువు వచ్చిందని ప్రచారం చేస్తున్నారు: సీపీఐ నారాయణ




హైదరాబాద్: సింగరేణి ఎన్నికల తర్వాత రాజకీయంగా కాంగ్రెస్, సీపీఐ మధ్య తగువు వచ్చిందని.. ఈ రెండు పార్టీలు విడిపోతాయని కొందరు ప్రచారం చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. కార్మికుల ఎన్నికలకు రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. గతంలో భారాస అధికారంలో ఉన్నప్పుడు దుష్ట సంప్రదాయానికి తెరలేపిందన్నారు. ఎన్నికల వేళ కార్మికులను ప్రలోభాలకు గురిచేశారని మండిపడ్డారు. సింగరేణి ఎన్నికల్లో భారాస అనుబంధ సంఘాన్ని ఓడించామన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు.




# జిరాక్స్ కాపీ రూ.40.. డౌన్‌లోడ్ చేసి ఇస్తే రూ.100

## - అభయ హస్తం ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల కొరతతో పెరిగిన డిమాండ్

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు అర్హులైన కుటుంబాల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు గురువారం నుంచి ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమం జిరాక్స్, నెట్ నిర్వాహకులకు కాసులను కురిపించింది. మలక్‌పేట, ఎల్బీనగర్, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభమైన మొదటి రోజునే అభయ హస్తం పథకాల దరఖాస్తు ఫారాల కొరత ఏర్పడింది. దీంతో అర్హులైన వారు దరఖాస్తు ఫారాల కోసం ఎగబడ్డారు. మలక్‌పేట నియోజకవర్గంలోని చావునీ, ఆజంపుర, ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాలతోపాటు, ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే దరఖాస్తు ఫారాల కోసం ఎగబడ్డారు. వాటి పంపిణీ ప్రారంభమైన కొద్ది సేపటికే దరఖాస్తులు అయిపోయాయని సిబ్బంది చెప్పడంతో అప్పటికే క్యూలో ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్న ఆలోచనతో చేసేది లేక ఫారాలను జిరాక్స్ చేయించుకోవడానికి ఎగబడ్డారు. దీన్ని ఆసరాగా చేసుకున్న నెట్ నిర్వాహకులు, జిరాక్స్ కేంద్రాల నిర్వాహకు లు దరఖాస్తు ఫారం సెట్‌ను జిరాక్స్ చేసేందుకు రూ.40లు వసూలు చేయ గా నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసేందుకు రూ.100లు వసూలు చేశారు. ఆజంపుర డివిజన్‌లోని కమల్‌నగర్ కమ్యూనిటీహాల్ కేంద్రానికి వచ్చిన వారంతా జిరాక్స్ దరఖాస్తు ఫారాల కోసం జిరాక్స్ సెంటర్లకు ఎగబడ్డారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన వారు జిరాక్స్ కాపీలను పెడుతున్న విషయాన్ని గమనించిన ఇన్‌చార్జి రమేష్ వాటిని తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో అప్పటి వరకు జిరాక్స్ తీసిన దరఖాస్తు ఫారం రూ.40లు, నెట్ నుంచి డౌన్ లోడ్ చేసిన కాపీలు రూ.100లు పలకగా వీటిని అధికారులు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని చెప్పడంతో ఒక్కమారు వాటి ధర రూ.10లకు పడిపోయింది. చంచల్‌గూడ, చావునీ, ఆజంపుర, ఓల్డ్‌మలక్‌పేట, సలీంనగర్, సరూర్‌నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, చంపాపేట ప్రాంతాల్లోని జిరాక్స్ షాపులు కిటకిటలాడాయి. దరఖాస్తు ఫారాల కొరత ఏర్పడిన విషయాన్ని ప్రభుత్వం జిరాక్స్ కాపీలు కూడా చెల్లు బాటవుతాయని చేసిన ప్రకటనతో వాటి ధర రూ.10లు కొనసాగింది.

**ఓల్డ్‌మలక్‌పేటలో దరఖాస్తు ఫారాల కొరత :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన గురువారం ఓల్డ్‌మలక్‌పేటలోప్రారంభమైంది సంబంధిత అదికారులు సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తు లు తీసుకున్నారు. మొత్తం నాలుగుచోట్ల కౌంటర్లు ఏర్పాటు చేశారు. అఫ్జల్‌నగర్ రెండు చోట్ల అంబేద్కర్‌నగర్ కమ్యునిటీహాల్, రేస్‌కోర్స్ కమ్యునిటీ హాల్‌లో దరఖాస్తులు తీసుకున్నారు. ఉదయం నుంచే ప్రజలు కౌంటర్లకు చే రుకున్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఓల్డ్‌మలక్‌పేట లో ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్లల్లో ప్రారంభమైన కొద్దిసేపట్లోనే దరఖాస్తుఫారాలు అయిపోయాయి. పారాల కోసం ప్రజలు జిరాక్స్ సెంటర్లకు, నెట్ సెంటర్లకు క్యూకట్టారు. ఒక్కో ఫారానికి రూ.10పెట్టి కొనుకున్నారు. కౌంటర్ల వద్ద దరఖాస్తుఫారాలు లేకపోవడంతో చాలామంది డబ్బులు పెట్టి కొన్నారు. ఎంఐఎం ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటుచేసి అక్కడికివచ్చిన వారికి సహాయ సహకారం అందించారు.




## ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఇప్పటివరకు బయటకు రాని విషయాలు చెప్పిన ప్రధాన నిందితుడు నందు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫాంహౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నందకుమార్ అలియాస్ నందు మాట్లాడారు.

దాదాపు ఏడాది తర్వాత ఈ కేసుపై నోరు విప్పిన ఆయన ఆసక్తికర విషయాలు చెప్పారు. ఈ కేసులో తాను బాధితుడిని మాత్రమేనని అన్నారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉన్నందున కొన్ని విషయాలను మాత్రమే వెల్లడిస్తున్నట్లు చెప్పారు. "" కేసులో నేను నిందితుడిని కాదు. బాధితుడిని. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి.. దక్కన్ కిచెన్ హోటల్‌ను నిర్వహిస్తున్నాను.

ఆ హోటల్‌ను నేలమట్టం చేయడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యాను. నాకు పార్టీలకు అతీతంగా ఏపీ, తెలంగాణకు చెందిన 50 మంది దాకా ఎమ్మెల్యేలు తెలుసు. పైలెట్ రోహిత్ రెడ్డితో ముందు నుంచి పరిచయం ఉంది" అని చెప్పారు. ఇప్పటి వరకు బయటకు రాని పలు ఆసక్తికర విషయాలను ఆయన వెల్లడించారు.

# ప్రజలు పథకాలు అడుగుతున్నారు.. పత్రాలు కాదు: జగదీశ్ రెడ్డి



సూర్యాపేట: కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీల అమలు చేతకాక అయోమయంలో పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. అడ్డగోలు హామీలిచ్చి ప్రజాపాలన పేరుతో తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో ఏ అప్లికేషన్లు లేకుండా లబ్దిదారులను ఎంపిక చేశామన్నారు. సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ హయాంలో దళారి వ్యవస్థ లేకుండా ఆన్‌లైన్ విధానం పెట్టామని తెలిపారు. ఆరు గ్యారంటీల దరఖాస్తు ఫారాలు అసంబద్ధంగా ఉన్నాయని చెప్పారు. కౌలు రైతులను పాసు పుస్తకం నంబర్లు అడుగుతున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులను ప్రజలు పథకాలు అడుగుతున్నారని, పత్రాలు కాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పత్రాల డ్రామాలు ఎక్కువకాలం సాగవన్నారు. తెలంగాణ ప్రజలు మీ మోసాలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారని, హామీలు అమలు చేయలేకపోతే ప్రజలు వెంటపడి తరుముతారని హెచ్చరించారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. రేపు రోడ్డెక్కనున్న 80 కొత్త బస్సులు

ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేస్తున్నది. ఎప్పటికప్పుడు రవాణారంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ.. వినూత్న పద్ధతుల్లో ప్రయాణికులకు చేరువవుతున్నది. ఈ క్రమంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.400 కోట్ల వ్యయంతో 1,050 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో 400 ఎక్స్‌ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, మరో 56 ఏసీ రాజధాని బస్సులను కొనుగోలు చేయనున్నది.

వీటికి తోడు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను హైదరాబాద్ సిటీలో 540, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 500 బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపడుతున్నది. కొత్త బస్సులన్నీ విడుతలవారీగా వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో బస్సుల్లో రద్దీ పెరిగింది. ఈ క్రమంలో అత్యాధునిక హంగులతో 80 కొత్త బస్సులు శనివారం రోడ్డిక్కించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో 30 ఎక్స్‌ప్రెస్, 30 రాజధాని ఏసీ, 20 లహరి స్లీపర్ కమ్ సీటర్ (నాన్ ఏసీ) బస్సులున్నాయి. ఆయా బస్సులను హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించనున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com